ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
వార్త
శుక్రవారం 04, సెప్టెంబర్ 2026 | 16 పేజీలు






# భద్రాద్రికి.. రైలుబాట

**కొత్తగూడెం, ప్రభాతవార్త :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి కీలకమైన పాండురంగాపురం- మల్కన్‌గిరి రైల్వే లైన్‌కు మరోసారి కదలిక వచ్చింది. వివిధ కారణాలతో పూర్తి ప్రాజెక్టు ఆలస్యమవుతున్న నేపథ్యంలో.. ప్రస్తుత దశలో పాండు రంగాపురం నుంచి మధ్యలోని సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ. రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించి, ఈ మార్గంలో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



- సుమారు 16 కి.మీ. మేర రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి..
- మంత్రి విజ్ఞప్తిపై తక్షణమే సానుకూలంగా స్పందించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్
- పాండురంగాపురం-సాకేతపురి మధ్య భూసేకరణ చేపట్టి రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్రం సిద్ధం

సీఎస్‌లో...

# ఇందిరమ్మ ఇళ్లకు బిల్లుల బకాయిలు

- ఐదు నెలలుగా ఎదురుచూపులు..
- అప్పుల భారం మోస్తున్న లబ్ధిదారులు
- ఇదు నెలలుగా మంజూరు కాని బిల్లులు
- 10238 మంది లబ్ధిదారులకు రాని బిల్లులు
- ఇంటి నిర్మాణాలు ఆగిపోయే ప్రమాదం

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త :** సొంతింటి కల నెరవేరుతుందని ఆశించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు ఆలస్యం కావడం ఇబ్బందిగా మారుతోంది. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న పలువురు లబ్ధిదారులకు గత ఐదు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వారు వాపోతు న్నారు. నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ ప్రభుత్వం నుంచి రావాల్సిన నగదు అందకపోవడంతో అప్పులు చేసిన వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇల్లు నిర్మించు కోవాలనే ఆశతో లబ్ధిదారులు తమ వద్ద ఉన్న కొద్దిపాటి పొదుపు సొమ్ముతో పాటు బంధువులు, స్నేహితుల వద్ద అప్పులు చేసి నిర్మాణ పనులు చేపట్టారు. ప్రభుత్వం దశలవారీగా బిల్లులు చెల్లిస్తుందన్న నమ్మకంతో పనులు కొనసాగించారు. అయితే నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా బిల్లులు విడుదల కాకపోవడంతో అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు చెబుతున్నారు.



2వ పేజీలో...



# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**కొత్తగూడెం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రతి భూయజమానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం భద్రాద్రి జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని రెవెన్యూ, భూ రీసర్వే, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి (రిజిస్ట్రేషన్, స్టాంపులు) రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి

2వ పేజీలో...

- రీసర్వేను వేగవంతం చేయాలి..
- అలసత్వం వహించే అధికారులను ఉపేక్షించం
- లైసెన్స్‌డ్ సర్వేయర్లు విధులకు హాజరుకాకుంటే చర్యలు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి: మంత్రి పొంగులేటి

# ఏసీబీ వలలో... అటవీ అధికారి..!!

- రూ.30 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రవికుమార్
- మధ్యవర్తితో కలిసి ఏసీబీ వలలో ఇద్దరు..
- ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ నేతృత్వంలో పక్కా ఆపరేషన్
- ఇల్లందు సబ్‌డివిజన్ అటవీశాఖలో మరోసారి అవినీతి బట్టబయలు..
- ఇంకా వలలో చిక్కని తిమింగలాలెందరో అన్న చర్చ

**ఇల్లందు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**



2వ పేజీలో...

# ఇందిరమ్మ ఇళ్లకు బిల్లుల బకాయిలు

మొదటి పేజీ తరువాయి..

**అప్పులే ఆధారం.. వడ్డీల భారం..**

ఇల్లు నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇసుక, ఇటుకలు, ఇనుము, ఇతర సామగ్రిని వ్యాపారుల వద్ద నుంచి అప్పుగా తీసుకున్నామని లబ్ధిదారులు చెబుతున్నారు. కూలీలకు కూడా చెల్లింపులు చేయాల్సి ఉందని, ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు అందకపోవడంతో అప్పు దారుల ఒత్తిడి పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రోజువారీ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటు డగా, ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని అంటున్నారు. ప్రభు త్వం ఇల్లు మంజూరు చేసిందనే సంతో షంతో నిర్మాణం ప్రారంభించాం. బిల్లులు సమ యానికి వస్తాయని భావించి అప్పులు చేసి పను లు పూర్తి చేశాం. ఇప్పుడు నెలలు గడుస్తున్నా డబ్బులు రాకపోవడంతో అప్పులు తీర్చలేకపోతు న్నాం" అని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

**నిర్మాణం పూర్తయినా.. బిల్లుల కోసం ఎదురుచూపులు..**

ఖమ్మం జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజ కవర్గాలలో కలిపి మొత్తం 16409 ఇందిరమ్మ ఇండ్లను మొదటి పేజీలో మంజూరు చేశారు. వీటిలో 1169 మంది లబ్ధిదారులు అసలు నిర్మాణాలను చేపట్టలేదు. మిగిలిన వారందరూ ఇంటి నిర్మాణాలను చేపట్టారు. వీరిలో 11157 మంది లబ్ధిదారులు వారి ఇంటి నిర్మాణాలను పూర్తి చేశారు. అయితే వీరిలో 919 మాత్రమే చివరి బిల్లును అందించారు. తప్ప మిగిలిన 10,258 మందికి మాత్రం ఇంటి బిల్లులను మంజూరు చేయలేదు. అదే విధంగా ఇప్పటికీ నిర్మాణం నిర్మాణాలను పూర్తిచేసిన లబ్ధిదారులు బిల్లులు రాకపోవడంతో ఆందోళనలో ఉన్నారు. బేస్ మెంటల్ పూర్తి చేసిన వారు 556 మంది ఉండగా స్లాబ్లెవరు వారికి పూర్తి చేసిన వారు 1062 మంది ఉన్నారు. వీరందరూ బిల్లులు రావట్లేదని ఉద్దేశంతో నిర్మాణాలను వేగవంతం చేయడం లేదు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో దశలవారీగా బిల్లులు చెల్లించే విధానం అమలు లో ఉంది. నిర్మాణ దశలను అధికారులు పరిశీలి ంచి, నిబంధనల ప్రకారం బిల్లులు మంజూరు చేయాల్సి ఉంటుంది. అయితే నిర్మాణం పూర్త యిన ఇళ్లకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని లబ్ధిదారులు చెబుతు న్నారు. తమ ఇళ్లను అధికారులు పరిశీలించి, అవసరమైన వివరాలను నమోదు చేసినప్పటికీ చెల్లింపులు మాత్రం జరగడం లేదని కొందరు అంటున్నారు. బిల్లుల కోసం కార్యాలయాల చు ట్టూ తిరగాల్సి వస్తోందని, ప్రతిసారి కొత్త తేదీలు చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. తమ పరిస్థితిని అధికారులు, ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

**పనులు ఆగిపోయే పరిస్థితి..**

ఇప్పటికే కొందరు లబ్ధిదారులు ఇంటి నిర్మా ణాన్ని పూర్తిచేసుకున్నప్పటికీ, మరికొందరు చివరి దశ పనులు పూర్తిచేయాల్సి ఉంది. బిల్లులు రాకపోవడంతో తలుపులు, కిటికీలు, విద్యుత్ వైరింగ్, నీటి సౌకర్యం, ప్లాస్టరింగ్ వంటి పనులు చేపట్టలేకపోతున్నామని వారు చెబుతున్నారు. డబ్బులు చేతికి అందకపోవడంతో నిర్మాణ సామగ్రి కొనుగోలు చేయడం కూడా కష్టంగా మారిందని అంటున్నారు. ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో బిల్లుల చెల్లింపుల సకాలంలో జరిగితేనే పేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నిర్మాణం పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు బకాయి ఉన్న మొత్తాలను వెంటనే విడుదల చేయడంతో పాటు, భవిష్యత్‌లో బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా స్పష్టమైన కార్యాచరణ రూపొందిం చాలని కోరుతున్నారు.

**తక్షణమే బిల్లులు విడుదల చేయాలి..**

ఐదు నెలలుగా బిల్లుల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారుల సమస్యను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించాలని డిమాండ్ వినిపి స్తోంది. అర్హత కలిగిన లబ్ధిదారుల వివరాలను మరోసారి పరిశీలించి, సాంకేతిక లేదా పరిపాలనా కారణాలతో పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరుతున్నారు. బిల్లులు అందితే అప్పులు తీర్చడంతో పాటు, కుటుంబ అవసరాలను తీర్చు కునేందుకు కొంత ఊరట లభిస్తుందని లబ్ధి దారులు చెబుతున్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న పథకంలో నిర్మాణం పూర్తిచేసిన వారికి బిల్లుల చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాల్సి న అవ సరం ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థి తిని పరిశీలించి, పెండింగ్ బిల్లుల వివరాలను సేకరించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా నిధులు విడుదల చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి..

నిర్వహించిన ఈ సమావేశంలో భూ రీసర్వే పురోగతి, నాన్‌కెడాస్ట్రల్, కెడాస్ట్రల్ గ్రామాల్లో సర్వే పనులు, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పనితీరు, 22ఏ భూములు, సాదా బైనామాలు, అటవీ- రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలు, భూభా రతి చట్టం అమలు, రిజిస్ట్రేషన్ శాఖ నూతన కార్యాలయాల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల పురో గతి, రెండో విడత ఇళ్ల మంజూరు, ఉచిత ఇసుక సరఫరా తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షిం చారు. సామాన్య ప్రజలు భూ సమస్యల పరిష్కా రం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని రూపొం దించిందని మంత్రి తెలిపారు. ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ఈ చట్టాన్ని తీసుకు వచ్చామని, వచ్చిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులకు న్యాయం చేయా లని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికా రులు, తహసీల్దార్లు, ఆర్డీవోలు సమన్వయంతో పనిచేసి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజలను గౌ రవంతో చూసి, వారి సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించేలా అధికారులు పనిచే యా లని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం, అలస త్వా న్ని ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు.

**రీసర్వేకు ప్రాధాన్యం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వేను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు రీసర్వే విధు లకు తప్పనిసరిగా హాజరుకావాలని, విధులకు హాజరుకాకుండా ప్రైవేట్ సర్వేలకు మాత్రమే పరిమితమయ్యే వారిపై నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే పనులకు అవసరమైన శిక్షణ పొందిన సిబ్బందిని తగిన సంఖ్యలో సిద్ధం చేసుకోవాలని, ప్రత్యా మ్నాయ సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాలని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లను ఆదేశిం చారు. క్షేత్రస్థాయిలో సర్వే పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రీసర్వేను వేగవంతం చేయాలని సూచించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అటవీ, రెవె న్యూ భూముల సరిహద్దు వివాదాలను శాశ్వ తంగా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. కలెక్టర్లు, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా సమావేశమై శాస్త్రీయ పద్ధతుల్లో భూముల కొల తలు చేపట్టి సరిహద్దులను నిర్ధారించాలని సూచించారు. గతంలో పోడు భూములకు పట్టాలు పొందిన రైతులు బోర్లు, విద్యుత్ కనెక్ష న్లు తదితర సౌకర్యాలు పొందే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇళ్లపై ప్రత్యేక దృష్టి**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, మందకొడిగా ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఇప్పు టికే ప్రారంభమైన మొదటి విడత ఇళ్లను త్వరి తగతిన పూర్తి చేయాలని, నిర్మాణాలు ప్రారంభం కాని ఇళ్లను అర్హతను పరిశీలించి రెండో విడత జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశి ంచారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అక్రమా లకు పాల్పడినా, లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసినా సమగ్ర విచారణ జరిపి బాధ్యు లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిం చి అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా చూడాలని సూచించారు. ఇళ్ల నిర్మాణానికి రవాణాతో కలిపి రూ.230 ధరకు సిమెంట్ బస్తాలు అందుబాటులో ఉన్నందున లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సహకరించాలని మంత్రి తెలిపారు. జనగామ జిల్లా కలెక్టర్ రూపొందించిన యాప్‌ను ఇతర జిల్లాల్లోనూ వినియోగించాలని సూచించారు.

**ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నా రు. భూ సర్వే, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశిం చారు. ప్రభుత్వ పథకాల అమలులో అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహిం చబోమని స్పష్టం చేశారు. సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, మాలోత్ రాందాస్ నాయక్, కోరం కనకయ్య, డాక్టర్ మట్టా రాగమయి, జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావుతో పాటు ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, శ్రీనివాసరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, విద్యా చందన, భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, డీఎఫ్‌వో విక్రమ్ సింగ్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్, సర్వే, అటవీ తదితర శాఖల అధికారులు, ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

# హెచ్సీఏ అండర్16 జట్టులో పాల్వంచ క్రీడాకారుల సత్తా

## సృజంత్, దివాకర్, ప్రిన్స్‌కు చోటు

పాల్వంచ, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: క్రికెట్‌లో పాల్వంచ యువ క్రీడాకారులు సత్తా చాటారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియే షన్ (హెచ్సీఏ) అండర్16 జట్టుకు పాల్వం చకు చెందిన నెక్స్‌జెన్ క్రికెట్ అకాడమీ క్రీడాకారులు సృజంత్, దివాకర్, ప్రిన్స్




ఎంపికయ్యారు. హెచ్సీఏ నిర్వహించిన అండర్16 జట్టు ఎంపికల్లో ప్రతిభ కనబరిచి ఈ ముగ్గురు క్రీడాకారులు జట్టులో స్థానం సంపాదించారు. చిన్న వయసులోనే ప్రతిభను చాటుకుని హెచ్సీఏ జట్టుకు ఎంపిక కావడం పట్ల వారి తల్లిదండ్రులు, క్రీడాభిమానులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎంపిక పాల్వంచ క్రీడా రంగానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. క్రీడాకారుల ఎంపికపై నెక్స్‌జెన్ క్రికెట్ అకాడమీ కోచ్‌లు అభిమన్యు, శరత్ కళ్యాణ్, పవన్ సాయి, పవన్ సీలపోగు హర్షం వ్యక్తం చేశారు. ఆటగాళ్ల క్రమశిక్షణ, కృషి, ప్రతిభకు ఈ ఎంపిక నిదర్శనమన్నారు. భవిష్యత్తులో మరింత కష్టపడి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి పాల్వంచకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ఏసీబీ వలలో... అటవీ అధికారి..!!

ఇల్లందు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త: అటవీశాఖలో లంచగొండి అధికారుల ఆటకు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరోసారి గట్టి చెక్ పెట్టింది. పోడు రైతు భూమిలో ట్రెంచ్ కొట్ట కుండా ఉండేందుకు రూ.30 వేల లంచం డిమాండ్ చేసిన ఇల్లందు సబ్ డివిజన్ పరిధిలోని ఆళ్లపల్లి మండలం రామానుజగూడెం ఇన్‌చార్జి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ రవికుమార్, ఆయన తరఫున డబ్బు తీసుకుంటున్న మధ్యవర్తి సాదిక్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనతో అటవీశాఖలో కొనసాగుతున్న అవినీతి వ్యవహారాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి.

**పోడు రైతును బెదిరించి లంచం డిమాండ్**

రామానుజగూడెం గ్రామానికి చెందిన ఓ పోడు రైతు సాగు చేస్తున్న భూమిలో అటవీశాఖ అధికారులు ట్రెంచ్ తవ్వేందుకు సిద్ధమయ్యారు. ట్రెంచ్ పనులు ఆపాలంటే రూ.30 వేల ముడుపులు ఇవ్వాలని బీట్ ఆఫీ సర్ రవికుమార్ రైతును డిమాండ్ చేసినట్లు తెలిసింది. అంత మొత్తాన్ని చెల్లించే స్తోమత లేకపోవడంతో బాధిత రైతు ఖమ్మం ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

**ఏసీబీ పక్కా వ్యూహం.. రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్**

ఫిర్యాదు మేరకు ఖమ్మం రేంజ్ ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించారు. బాధితుడికి గుర్తు పెట్టిన కరెన్సీ నోట్లను ఇచ్చి మధ్యవర్తి సాదిక్ ఇంటికి పంపించారు. అక్కడ సాది క్ రూ.30 వేల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడి చేసి సాదిక్‌తో పాటు బీట్ ఆఫీసర్ రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం లంచం నగదు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు.

**అటవీశాఖలో ఇది నాలుగో ఏసీబీ కేసు**

జిల్లాలో ఈ ఏడాది అటవీశాఖ అధికారులపై నమోదైన నాలుగో అవి నీతి కేసు ఇదే కావడం గమనార్హం. వరుసగా అటవీశాఖ అధికారులు ఏసీ బీ వలలో చిక్కుతుండటంతో శాఖలో అవినీతి ఎంత లోతుగా పాతుకు పో యిందనే చర్చ సాగుతోంది. ఇంకా పలువురు అవినీతి అధికార తిమింగ లాలు ఏసీబీ వలలో చిక్కాల్సి ఉందన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

**ప్రజలకు ఏసీబీ సూచన**

ప్రభుత్వ సేవల కోసం ఎవరైనా అధికారి లంచం డిమాండ్ చేస్తే భయ పడకుండా వెంటనే ఏసీబీని ఆశ్రయించాలని అధికారులు సూచి స్తున్నారు. ప్రజల సహకారంతోనే అవినీతిని అరికట్టడం సాధ్యమని, లంచం ఇచ్చేవా రు కాదు.. లంచం అడిగేవారే నేరస్థులని స్పష్టం చేస్తున్నారు. రైతుల హక్కులను కాపాడాల్సిన అధికారులు బలహీనతలను ఆసరాగా చేసుకుని లంచాలకు పాల్పడడం ఆందోళనకరం. ఏసీబీ చర్యలు అవినీతి అధికారులకు హెచ్చరికగా మారాలని, అటవీశాఖలో పూర్తిస్థాయి ప్రక్షాళన జరగాలని ప్రజలు కోరుతున్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర వైఫల్యం

## మాజీ మంత్రి పువ్వాడ

రఘునాథపాలెం, ప్రభాతవార్త సెప్టెంబర్ 3:



రఘునాథపాలెం మండలం కోయచెలక గ్రామంలో నిర్వహించిన రైతు సదస్సు సమావేశంలో పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూరైతు రుణమాఫీ రూ. 2 లక్షల వరకు పూర్తిగా మాఫీ చేస్తామని 100రోజుల్లోపే అమలు చేస్తామని హామీ ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక బడ్జెట్ కోతలు పెడుతూ కేవలం అరకొరగా మాత్రమే రుణమాఫీ పూర్తి చేశారు. ఏ గ్రామానికి వెళ్లినా మెజారిటీ రైతులకు రుణమాఫీ కాలేదని, దీనిపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో ఏటా ఎకరానికి రూ. 10,000 చొప్పున క్రమం తప్పకుండా అందించిన 'రైతు బంధు' నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి, రైతులకు రూ. 15,000 ఇస్తామన్న హామీని పక్కన బెట్టిందని మండిపడ్డారు. కౌలు రైతులకు కానీ, రైతు కూలీలకు కానీ ఒక్క రూపాయి కూడా అందించలేదు. కేసీఆర్ పాలనలో ఎరువుల కొరత లేకుండా చూస్తే, నేడు కాంగ్రెస్ హయాంలో యూరియా కోసం యాప్‌లలో బుకింగ్స్, క్యూ లైన్లు, చెప్పులు లైన్లో పెట్టే పాత రోజులు మళ్లీ వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటల ఉచిత విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం సరిగ్గా ఇవ్వలేకపోతోందని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విఫల కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు, రైతులు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని, కేసీఆర్ గారి నాయకత్వంలో మళ్లీ తెలంగాణ సుభిక్షంగా మారుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ, గుత్తా రవి, కొంటె ముక్కుల వెంకటేశ్వర్లు, హరి ప్రసాద్, నున్న శీను, కాంపాటి రవికుమార్, గుండ్ల ముత్తయ్య, రఘునాథపాలెం మండలం వివిధ గ్రామ బి ఆర్ఎస్ సర్పంచులు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు, మండల పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల బాకీ కార్డుల పంపిణీ

బోనకల్, ప్రభాతవార్త :

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా బోనకల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో "కాంగ్రెస్ 1000 రోజుల బాకీ కార్డులు" పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బానోత్ కొండ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని, వాటిలో అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్, రైతు భరోసా, ప్రతి పంటకు రూ.500 బోనస్, రైతు



కూలీలకు ఆర్థిక సాయం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ కింద తులం బంగారం, స్కూటీల వంటి హామీలను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిందని గుర్తు చేశారు. 1000 రోజుల పాలన పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఇంకా అనేకం పెండింగ్‌లోనే ఉన్నాయి. హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రజలకు రావాల్సిన ప్రయోజనాలను వెంటనే అందించి, ఎన్నికల హామీలను అమలు చేయాలి" అని బానోత్ కొండ డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు పరిస్థితిని గుర్తు చేసేందుకే బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజల ముందుంచి, వాటి అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బోనకల్ సర్పంచ్ బానోత్ జ్యోతి కొండ, వేమూరి ప్రసాదరావు, పర ప్రసాదరావు, కాకాని శ్రీనివాస్‌రావు, కేతినేని సత్యనారాయణ, గొల్లమందల రాజారావు, గుర్రాల చిట్టి, బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ రవి, ఇటుకల శ్రీనివాస్‌రావు, బోనకల్ గ్రామ అధ్యక్షులు గుండపనేని సుధాకర్‌రావు, కార్యదర్శి తెల్లూరి రమేష్, గంగుల పుల్లయ్య, యార్లగడ్డ వెంకటేశ్వర్లు, మల్లెల వేలాద్రి, అంతోటి ఆదినారాయణ, నారపోగు విజయ్, బదావత్ గంగు, బానోత్ మురళి, గుగులోతు శ్రీను, అంతోటి నాగకృష్ణ, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా అమలు చేసి, తెలంగాణ ప్రజలకు రావాల్సిన ప్రయోజనాలను వెంటనే అందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

## ఇరువురు వ్యక్తుల రిమాండ్

నేలకొండపల్లి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

మెరుగుపెడతామని నమ్మించి మోసం కు పాల్పడిన ఇరువురు వ్యక్తులను గురువారం నేలకొండపల్లి పోలీసులు రిమాండ్ చేశారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి లోని ఎస్సీ, బీసీ కాలనీ లో త్రివేణి అనే మహిళ పట్టీలకు మెరుగుపెడతామని బీహార్ కు చెందిన పంకజ్ కుమార్, పవన్ కుమార్ లు పౌడర్ లిక్విడ్ లో కలిపి పట్టీలను తరుగు చేసి అందించటంతో మోసం చేశారని గ్రహించి బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి ఇరువురిని రిమాండ్ కు పంపారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి.



తిరుమలాయపాలెం ప్రభాత వార్త సెప్టెంబర్ 3

తిరుమలాయపాలెం మండలం లోని జూపేడ , బచ్చోడు గ్రామాలకు మధ్యలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి జరిగిన సంఘటన జరిగింది వివరాల్లోకెళ్తే కనతాల సంపత్ తండ్రి వెంకటేశ్వర్లు వయసు 42 సంవత్సరాలు వృత్తిపరంగా ట్రాక్టర్ డ్రైవరు ఇతను ఖమ్మం ఖానాపురం నుండి అత్తగారి గ్రామమైన జూపెడ గత ఎనిమిది సంవత్సరాల క్రితం వచ్చారు ఇతనికి భార్య విజయ ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం రాత్రి తొమ్మిది గంటలకు ట్రాక్టర్ ఇంజన్ కు కల్టివేటర్ తగిలించుకొని బచ్చోడు గ్రామంలో దుక్కిదున్నుటకు వెళ్ళి దుక్కిదున్ని తిరిగి జూపెడ గ్రామం వైపు వస్తుండగా మార్గం మధ్యలో దమ్మాయిగూడెం టూ కాకరవాయి వెళ్ళు రోడ్డు మీద జూపెడ, బచ్చోడు గ్రామాల మధ్య ప్రక్కన రోడ్డు మీదనే సంపత్ అనుమానా స్పదంగా పడి సవమై ఉన్నాడు ట్రాక్టర్ ఇంజన్ కొద్దిదూరంలో రోడ్డు ప్రక్కకి వెళ్లి ఆగిపోయింది ఇదంతా బుధవారం రాత్రి సుమారు 10, 11.గం లకు జరిగి ఉండవచ్చునని గ్రామస్తుల అనుమానం, గురువారం తెల్లవారు జామున అటుగా రోడ్డుపై వెళ్లుచున్న ప్రయానికులు చూసి జూపెడ గ్రామస్తులకు, బంధువులకు చెప్పగా వారు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించగా విషయం తెలుసుకున్న పోలీసులు రెండవ ఎస్ ఐ రాజయ్య ఘటనా స్థలానికి చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించి శవాన్ని పంచణామ నిమిత్తం వారి బంధువుల సహాయంతో ఖమ్మం గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలిచారు పూర్తి విషయాలు తెలియాల్సి ఉన్నది.

## ఎక్సైజ్ సిఐగా రమ్య, ఎస్సైగా వెంకన్న బాధ్యతలు స్వీకరణ



నేలకొండపల్లి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

నేలకొండపల్లి ఎక్సైజ్ స్టేషన్ సీఐగా రమ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ లో సీఐగా పని చేస్తున్న రమ్య ను నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ గా బదిలీ చేయటంతో ఈ మేరకు బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా నేలకొండపల్లి ఎక్సైజ్ స్టేషన్ కు మరో ఎస్సై గా వెంకన్న బాధ్యతలు స్వీకరించారు. ఇరువురును సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ఎక్సైజ్ సర్కిల్ లో గుడుంబా ఇతరత్రా విషయాల పై వారు సిబ్బందితో చర్చించారు.

## బాలికలకు విద్య బంగారు భవితకు పునాది

## విద్యారంగం తో పాటు క్రీడల్లోనూ రాణించాలి

కామేపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త:





విద్యతో పాటు క్రీడారంగంలో రాణింపుతో బాలికలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీవో ధరావత్ సోంలాల్, సర్పంచ్ అజ్మీర బుల్లి హరినాయక్, హెచ్ఎం బి.రఘునాథ్,మ్యాట్రిన్ జి.స్వర్ణలత అన్నారు. గురువారం గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలికలకు ప్రభుత్వం సరఫరా చేసిన బ్యాగులు,బెడ్ షీట్స్, కార్పెట్స్, టవల్స్, ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు పంపిణీ చేశారు. అదే విధంగా మండల స్థాయిలో గోవింద్రాల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వాలీబాల్, కోకో, కబడ్డీ,లాంగ్ జంప్, రన్నింగ్, షాట్ పుట్ పోటీలలో విజేతలకు నిలిచిన బాలికలకు మెడల్స్,సర్టిఫికెట్లు,ట్రోఫీలను కూడా వారు పంపిణీ చేశారు. అనంతరం



వారు మాట్లాడారు. బాలికల విద్య భవితకు పునాది అన్నారం. చదంవులో రాణించి ముందుకు సాగాలని కోరారు. ప్రభుత్వం అందజేస్తున్న సదు పాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిషత్ పర్యవేక్షకులు తన్నీరు నరేందర్, ఏపీవో అద్దంకి శ్రీరాణి, పి ఈ టి ఏ.సుస్మిత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాలు-దారుణాలు



## స్థానిక షైన్ హైస్కూల్లో ఘనంగా ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు..

..బోనకల్, ప్రభాతవార్త :



స్థానిక షైన్ హై స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు చాలా ఘనంగా నిర్వహించారు చిన్నారులు శ్రీకృష్ణుడు మరియు రాధా వస్త్రధారణలో అందరిని ఆకట్టుకున్నారు. తదుపరి ఉట్టి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు చిన్నారులు ఈ కార్యక్రమంలో చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా మాట్లాడుతూ హిందూ ధర్మంలో శ్రీకృష్ణుడు శ్రీమహావిష్ణువు యొక్క ఎనిమిదవ అవతారంగా పూజలు అందుకుంటున్నాడని, ధర్మాన్ని రక్షించడానికి దుష్టశిక్షణ చేయడానికి తను ఎప్పుడూ ముందుంటానని శ్రీకృష్ణుడు గీత ద్వారా చాటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా,డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్,ప్రిన్సిపల్ అయిటి పాముల శ్వేత, అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## డిజిటల్ పంట సర్వేను తనిఖీ చేసి న అధికారి

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త.

మండల పరిధిలో సకినవీడు గ్రామంలో క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న డిజిటల్ పంట సర్వేను మండల వ్యవసాయాధికారి బోయినపల్లి సాయి శివ , పరిశీలించి, వాలంటీర్లకు డిజిటల్ పంట నమోదు పైన పలు సూచనలు చేశారు. గ్రామంలో ప్రతి కమతంలో రైతులు వేసిన పంటలను త్వరితగతిన మరియు కచ్చితత్వంతో నమోదు చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో డిజిటల్ పంట సర్వే నిర్వహించేటప్పుడు రైతులు కూడా భాగస్వామ్యం అవ్వాలని, రైతులు వేసిన పంటలు, రకాలు మరియు నీటి వనరుల వివరాలు తెలపడం ద్వారా పంట సర్వేను త్వరగా పూర్తిచేయవచ్చు అని పేర్కొన్నారు. డిజిటల్ పంట సర్వే ద్వారా నమోదు చేసిన పంట వివరాలను పంటల కొనుగోళ్లకు, పంట నష్టపరిహారం, రైతు రుణాలు వంటి వివిధ ప్రభుత్వ పథకాలు అందించడానికి ప్రామాణికంగా తీసుకుంటారు అని తెలియజేశారు. అలాగే రైతులకు కావాల్సిన వాతావరణ సమాచారం మరియు వివిధ పంటలలో అవసరమైన సూచనలు మరియు సలహాలు అందించడానికి ఈ డిజిటల్ పంట సర్వే దోహదపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నాగినేని నాగసాయి, వాలంటీర్ రేళ్లచెర్ల దినేష్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## 4 ఇన్‌క్లైన్ వద్ద 33.550 కిలోల కాపర్ వైర్ పట్టివే త



రుద్రంపూర్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

కొత్తగూడెం ఏరియా 4 ఇన్‌క్లైన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఆటో ట్రాలీని ఎస్ పీసీ సిబ్బంది గుర్తించారు. ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్ గారు, జూనియర్ ఇన్‌స్పెక్టర్ టి. కామరాజు ధ్వర్యంలో ఎస్ పీసీ సిబ్బంది మల్లికార్జునరావు, హనోక్ రాజు, జనార్ధన్, సుధాకర్ ట్రాలీని ఆపేందుకు ప్రయత్నించగా, డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో సిబ్బంది ట్రాలీని వెంబడించి 3 ఇన్‌క్లైన్ ప్రాంతంలో పట్టుకున్నారు. ట్రాలీని తనిఖీ చేయగా 33.550 కిలోల కాపర్ వైర్ లభించింది. అనంతరం ట్రాలీ, డ్రైవర్‌తో పాటు కాపర్ వైర్‌ను ఎస్ పీసీ కార్యాలయానికి తరలించారు. కాపర్ వైర్‌ను విక్రయించిన వ్యక్తుల వివరాలు తెలుసుకునేందుకు వారిని సంప్రదించగా, వారు ఇంట్లో లేకపోవడంతో ఈ విషయాన్ని ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్ కి తెలియజేశారు. అనంతరం కాపర్ వైర్‌ను కొనుగోలు చేసి తరలిస్తున్న వ్యక్తిని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు తదుపరి విచారణ చేపట్టారు.




# పారంపర్య వైద్యుల మహాసభలకు పీఓ రాహుల్‌కు ఆహ్వానం

**భద్రాచలం, సెప్టెంబర్ 3(ప్రభాత వార్త):**

పారంపర్య వైద్యుల మహా సంఘం (పీవీఎంఎస్) తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ ఐటీడీఏ పీఓ బి. రాహుల్‌కు పారంపర్య వైద్యులు ఆహ్వానం అందించారు.సెప్టెంబర్ 8 నుంచి మూడు రోజుల పాటు మహాసభలుగురువారం భద్రాచలంలోని ఐటీడీఏ పీఓ చాంబర్‌లో ఆహ్వాన పత్రికను అందించిన వైద్యులు మహాసభల వివరాలను తెలియజేశారు.భద్రాచలంలోని రామాలయం సమీపంలో ఉన్న శ్రీ మార్కండేయ పద్మశాలి భవన్‌లో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో రాష్ట్ర



మూడవ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని పీఓ రాహుల్‌ను నిర్వాహకులు కోరారు.ఆయుర్వేద మూలాలను సామాన్యులకు చేరువ చేయాలిఈ సందర్భంగా పీఓ రాహుల్ నిర్వాహకులను అభినందించారు.ఆయుర్వేద వైద్య విధానంలోని మూలాలను సామాన్య ప్రజలకు చేరువ చేసేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.పారంపర్య వైద్య విధానాలపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి మహాసభలు దోహదపడతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పీవీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్య రామంచి శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ వైద్య జి. సుగుణారావు పాల్గొన్నారు.వైద్యులు తూము రమేష్, దశరథ్ రజువా, కె. మహేందర్, తీగల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**చర్ల,సెక్టంబర్ 3,( ప్రభాతవార్త)**



ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో గురువారం ముందస్తుగా నిర్వహించిన సెల్ఫ్ టీచింగ్ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఉపాధ్యాయుల దినోత్సవం ముందు రోజు సెలవు దినం కావడం తో ముందుగానే సెల్ఫ్ టీచింగ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దాదాపు 250 మంది విద్యార్థులు ఉపాధ్యాయుల వేశదారణ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పాఠశాల ఉపాధ్యాయుల పర్యవేక్షణ లో విద్యార్థులు భోదన బోదనేతర సిబ్బంది అధికారులుగా బాధ్యతలు చేపట్టిన విద్యార్థులు క్రమశిక్షణతో తరగతులను నిర్వహిస్తూ, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి తమ బోధనా నైపుణ్యాలతో అందరినీ అకట్టుకున్నారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి ఆశయాలకు అనుగుణంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను, ఉపాధ్యాయ వృత్తి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తుందని పాఠశాల యాజమాన్యం తెలిపారు. 250 మంది విద్యార్థిఉపాధ్యాయులు వివిధ సబ్జెక్టులలో చక్కటి ప్రణాళికతో బోధన అందించారు. ఉత్తమంగా పాఠాలు బోధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించింది. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ములకపాడులో డ్రైనేజీ సమస్యపై ఆక్రమణదారులకు ఎమ్మెల్యే సూచనలు

**దుమ్ముగూడెం: ప్రభాతవార్త (సెప్టెంబర్ 3)**



ములకపాడు గ్రామపంచాయతీలో ములకపాడు ప్రధాన రహదారి వద్ద నెలకొని ఉన్న డ్రైనేజీ సమస్య ఆక్రమణలుపై భద్రాచలం ఎమ్మెల్యే త్నెల్ల వెంకటరావు అధికారులకు ఆక్రమణదారులకు పలు సూచనలు చేశారుములకపాడు గ్రామపంచాయతీ పరిధిలో నుఫ్నంక్షన్ హాల్ నుండి ములకపాడు క్రాస్ రోడ్డు పశువుల హాస్పటల్ వరకు దుకాణదారులు ఆక్రమించుకొని డ్రైనేజీ వ్యవస్థను బ్లాక్ చేయడంతో పశు వైద్యశాలలోకి బురద నీరు చేరుతుందని పశు వైద్యాధికారి గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు ఈ క్రమంలో స్థానిక సర్పంచ్ తులసమ్మ కార్యదర్శి నరేష్ ఆక్రమణ దారులతో మాట్లాడుతుండగా చర్లవైపు వెళుతున్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు వారి వద్ద ఆగి సమస్యను అడిగి తెలుసుకున్నారు ఆక్రమణదారుకు సమస్యల పై అవగాహనా కల్పించి చరవాణిలో ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడారు బౌండరీలు వేసి మొత్తం డ్రైనేజ్ ట్రెంచ్ కొట్టి నీటిని మళ్లించవలసిందిగా సూచించారు ఈ డ్రైనేజీ సమస్యకు పరిష్కారాన్ని చూపించాలని గ్రామపంచాయతీ సర్పంచ్ కు అధికారులకు తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పర్సిక తులసమ్మ సెక్రటరీ నరేష్ ఎస్ ఐ జగన్ స్థానిక రాజకీయ నాయకులు ములకపాడు గ్రామస్తులు దుకాణదారులు పాల్గొన్నారు



## రైతు సమస్యలపై బీఆర్ఎస్ పోరుబాట

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:**



కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట కార్యక్రమం రెండో రోజు బూర్గంపహాడ్ మండల కేంద్రంలో నిర్వహించారు.నిరసన కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, రైతులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బూర్గంపహాడ్ మండల మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. మూడు పంటలకు రైతుబంధు రూ.15 వేల చొప్పున అందిస్తామని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, సన్న వడ్లకు రూ.500 బోనస్, కౌలు రైతులకు రైతుబంధు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీలు అమలుకు నోచుకోలేదన్నారు.రైతులకు అవసరమైన యూరియాను సైతం సక్రమంగా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని ప్రకటించినా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా వంటి పథకాలను కొనసాగించి రైతు కుటుంబాలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ ఈ నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల నాయకులు, సర్పంచులు, ఉపసర్పం చులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతి నిధులు, అనుబంధ సంఘాల నాయకులు, రైతులు, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు, యువజన, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:**

బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చీన్యా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.ఇటీవల కురిసిన వర్షాలు, వీచిన గాలుల కారణంగా కళాశాల ఆవరణలో పడిపోయిన చెత్తాచెదారం, దుమ్ము, తరగతి గదులకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కలిసి తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చీన్యా మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని విద్యార్థులకు సూచించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం కేవలం ఒకరోజుకే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో భాగం కావాలని ఆకాంక్షి ంచారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రిలియంట్ విద్యాసంస్థల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**సారపాక, ప్రభాతవార్త:**



సారపాకలోని బ్రిలియంట్ విద్యాసంస్థలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమానికి సంస్థ చైర్మన్, ప్రముఖ విద్యావేత్త డా. బి.ఎన్.ఆర్. ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణుడు కేవలం దేవుడు మాత్రమే కాకుండా గొప్ప గురువు, నాయకుడని అన్నారు. భగవద్గీత ద్వారా కర్తవ్య నిర్వహణ, క్రమశిక్షణ, లక్ష్యసాధన వంటి విలువలను శ్రీకృష్ణుడు బోధించారని పేర్కొన్నారు. విద్యార్థులు శ్రీకృష్ణుని ఆదర్శంగా తీసుకొని అల్లరితో పాటు ఆలోచన, క్రమశిక్షణ, లక్ష్యసాధనకు ప్రాధాన్యతనిస్తే జీవితంలో ఉన్నత విజయాలు సాధించగలరని సూచించారు.వేడుకల్లో భాగంగా చిన్నారి విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించారు. భక్తిగీతాలు ఆలపిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఊకె శిరీష కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి

### బి.యస్.పి జిల్లా ఉపాధ్యక్షుడు యాసం సిద్దార్థ పూలే

**చర్ల , సెక్టెంబర్ 3,(ప్రభాతవార్త )**



హత్యకు గురైన ఊకే శిరిషా మృతికి కారణమైన వారికి తగిన శిక్ష వేసి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకొని కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని బిఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు యాసం సిద్దార్థపూలే డిమాండ్ చేసారు.చర్లలో గురువారం బిఎస్పీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన కొత్తగూడెం జిల్లా ఆదివాసీ బిడ్డ ఊకే శి రిషా హత్య చేసిన నరహంతకున్ని అరెస్ట్ చేయడమే జీవితకాలం శిక్ష వేసి,ఆదివాసీ చట్టాలను బలోపేతం చేసే విధంగా నిర్ణయాలు తీసుకొని ముఖ్యంగా మహిళలకు పూర్తిగా రక్షణ కల్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇ.సి మెంబర్ వీసంపల్లి నర్సింహారావు, భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షులు చెన్నం మోహన్ రావు, మండల అధ్యక్షులు పాయల మోహన్ రావు.కాకా నరసయ్య. దుర్వా నరసింహారావు. కారం జనార్ధన్. జోగయ్య. సోయం మంగతాయి. పాయల ప్రమీల. కారం వెంకటలక్ష్మి ్మ. మొడెం రాములు. కాక రమేష్. తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకులుగా ఉపాధ్యాయులు నిలవాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

**ఖమ్మం, సెప్టెంబర్ 3, ప్రభాత వార్త :**



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన భవిష్యత్ అవకాశాలను పరిచయం చేస్తూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకునేలా మెంటార్లు మార్గనిర్దేశం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఏ స్క్వేర్ ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పెర్ఫార్మన్స్ గ్రేడింగ్ ఇండెక్స్, ఫౌండేషన్ లిటరసీ మరియు న్యూమరసి అంశాల పై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్య, వివిధ కెరీర్ అవకాశాలు, భవిష్యత్ లక్ష్యాలపై తగిన అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తమ చుట్టూ ఉన్న పరిస్థితులను చూసి చదువుకోవటం వలన కలిగే ఉపయోగాల పై అవగాహన పరచాలి. ప్రస్తుత కాలంలో విద్యతో పాటు ప్రత్యేక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఎన్నో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థి సంప్రదాయ కెరీర్‌లకే పరిమితం కాకుండా, తన ఆసక్తి, ప్రతిభకు అనుగుణంగా వివిధ రంగాల్లో అవకాశాలను అన్వేషించేలా ప్రోత్సహించాలన్నారు. పదో తరగతి కూడా పూర్తి చేయలేకపోయిన ఒక వ్యక్తి వీడియో ఎడిటింగ్ నైపుణ్యాన్ని నేర్చుకొని కంటెంట్ క్రియేటర్లకు వీడియో ఎడిటింగ్ చేస్తూ నెలకు సుమారు రూ.1.50 లక్షల వరకు సంపాదిస్తున్న ఉదాహరణను కలెక్టర్ వివరించారు. విద్యార్థులు ముందుగా తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు దశలవారీగా చిన్న చిన్న లక్ష్యాలను ఏర్పరచుకొని సాధన చేసేలా మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. ములుగు జిల్లాలో ఇదే తరహా కార్యక్రమాన్ని నిర్వహించగా మంచి ఫలితాలు వచ్చాయని కలెక్టర్ గుర్తు చేశారు. పలువురు విద్యార్థులు డాక్టర్లు, ఇంజినీర్లు, డేటా సైంటిస్టులు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, ఆస్ట్రోనాట్స్ తదితర విభిన్న కెరీర్‌లను ఎంచుకోవాలని ఆకాంక్షలు వ్యక్తం చేశారని తెలిపారు ఈ కార్యక్రమంలో డిఈఓ సదానందం, ఏయంవో పెసర ప్రభాకర రెడ్డి, స్క్వేర్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీలక్ష్మి రెడ్డి, సంబంధిత అధికారులు, శిక్షకులు, మెంటర్లు తదితరులు పాల్గొన్నారు.




### శిక్షణ పూర్తి చేసుకున్న అగ్రి ఇన్పుట్ డీలర్స్. సర్టిఫికెట్లు ప్రధానం చేసిన ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ సరిత

**ఖమ్మం వ్యవసాయం సెప్టెంబర్ 3.**



గురువారం నాడు రఘునాథ పాలెం రైతు వేదిక నందు దేశి శిక్షణ పూర్తి చేసుకున్న (79 )అగ్రి ఇన్పుట్ డీలర్స్ కు ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రీ ఇన్పుట్ డీలర్స్ ని ఉద్దేశించి సరిత మాట్లాడుతూ సాంప్రదాయ వ్యవసాయంలో థీరీ,మరియు ఫీల్డ్ లెవల్లో నేర్చుకున్న వాటిని రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడును ఎలా సాధించాలో తెలియజేయాలని,



రైతులకు వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించాలని తెలియజేశారు. ఐపీఎల్, ఐ ఎన్ ఎం, ఐ సి ఎం బెస్ట్ ఆగ్రో అనామి పద్ధతిలో అందించే విధంగా రైతులను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో దేశి రెండు బ్యాచులలో 79 మంది డీలర్లు, ఏ డి ఏ సతీష్, వాణి, ఏవోలు అరుణ జ్యోతి, అరుణ కుమారి, భాస్కరరావు, ఫెసిలిటీ టీటర్ డేవిడ్ జైపాల్ రావు, ప్రియాంక, చంద్ర శేఖర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# వికాస్ స్కూల్ లో జన్మాష్టమి వేడుకలు

**ఖమ్మం విద్యా విభాగం సెప్టెంబర్ 3, ప్రభాత వార్త :**

ఖమ్మం నగరంలోని బి . ఆర్. ఎస్ పార్టీ ఆఫీసు ఎదురుగా, ఎన్. ఎస్ . టి రోడ్డులోని వికాస్ స్కూల్ లో శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని గురువారం శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా పాఠశాలను వివిధ రకాల పూలమాలలతో అలకరించి ఆహ్లాదంగా వేడుకలను జరిపారు . శ్రీ కృష్ణ, రాధ, గోపిక వేషధారణలలో చిన్నారులు ఆద్యాంతం అలరించారు . ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం లో ఉట్టి ఏర్పాటు చేసి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు . చిన్నారులచే ఇటువంటి కార్యక్రమాలు చేయించటం వలన, తరగతి గది లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఉంటారనే ఆలోచనతో వివిధ రకాలైన సాంస్కృతిక కార్యక్రమాల్ని నిర్వహిస్తూ విద్యార్థులలో పలు విషయాల పట్ల ఆసక్తి పెంపొందించేలా ప్రోత్సాహిస్తున్నామని కరస్పాండెంట్ ప్రిన్సిపల్ వై. లావణ్య తెలిపారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.




# న్యాయం చేయండి

## విలేకరుల సమావేశంలో బాధితులు

## పోతనబోయిన నాగరాజు

**ఖమ్మం, సెప్టెంబర్ 3, ప్రభాత వార్త :**




రఘునాథపాలెం మండలం ఎంపీడీవో కార్యాలయం పక్కన తమకు చెందిన ఇంటి స్థలాన్ని కొందరు వ్యక్తులు కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు పోతనబోయిన నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ.. 2006 నుండి 2026 వరకు నలుగురు వ్యక్తులు వరుస క్రమంలో విక్రయాలు జరిపారని, వాటి లింకు డాక్యుమెంట్లతో పాటు అన్ని అర్హతలు గల డాక్యుమెంట్తో గత సంవత్సరం 2025లో అట్టి స్థలాన్ని తాము కనుగోలు చేశామని, ఈ స్థలంతో ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు తమ స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జరిగిన ఘటనపై రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇట్టి విషయంపై పూర్తిస్థాయి విచారణ జరిపి మాకు న్యాయం చేయాలని జిల్లా అధికారులను వేడుకుంటున్నారు. సమావేశంలో ఈగ పూర్ణ, కేతు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్టియన్ మైనారిటీలకు గ్రాఫిక్ డిజైన్ విత్ ఏఐ టూల్‌లో శిక్షణ, ఉపాధి అవకాశాలు

## జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్

## దరఖాస్తు సమర్పణకు సెప్టెంబర్ 10 చివరి తేదీ

**ఖమ్మం కలెక్టరేట్ సెప్టెంబర్.03**

తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 202627 సంవత్సరానికి క్రిస్టియన్ మైనారిటీలకు గ్రాఫిక్ డిజైన్ విత్ ఏఐ టూల్ లో శిక్షణ అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు క్రిస్టియన్ మైనారిటీ వర్గానికి చెందిన వారై ఉండాలని, పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం 2 లక్షలలోపు, గ్రామీణ ప్రాంతాల్లో లక్షన్నర లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలని, కనీస విద్యార్హతగా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులు తమ దరఖాస్తులను కలెక్టరేట్ రెండవ అంతస్తు, ఎస్29లో గల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో లేదా బల్లేపల్లిలో యూనియన్ బ్యాంక్ పైన గల విన్సోల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌లో సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు సమర్పణకు సెప్టెంబర్ 10 చివరి తేదీ అని, అర్హత కలిగిన క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులు ఈ శిక్షణ, ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9704003002 మొబైల్ నంబర్ నందు సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన అద్భుతం

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు

## నూతి సత్యనారాయణ గౌడ్

**ఖమ్మం సెప్టెంబర్ 3, ప్రభాత వార్త:**



రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలతో వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన అద్భుతంగా కొనసాగిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు . సంజీవరెడ్డి భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 1000 రోజుల పాలనపై బిఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని, గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి నాయకులు ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజా ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించాలని తెలిపారు. అదేవిధంగా సోషల్ మీడియా వేదికగా 1000 రోజుల అద్భుతపాలనపై ప్రచారం చేయాలని కోరారు. పది సంవత్సరాల దుర్మార్గ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహచర మంత్రివర్గ సభ్యులు ప్రజాపాలన గావిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చేశారని, బీ ఆర్ ఎస్ నాయకులు 1000 రోజుల పాలనపై నిరసనలు వ్యక్తం చేయటం అతి పెద్ద విచిత్రంగా ఉందని అన్నారు., అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ, అర్బన్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు మంత్రివర్గ సహచరుల ఆధ్వర్యంలో ప్రజాపాలన 1000 రోజులు పూర్తయిన సందర్భంగా శ్రేణులతో కలిసి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వద్దెబోయిన నరసింహారావు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీ నాయక్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, అనుబంధ సంఘ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, విప్లవ కుమార్, జిల్లా ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్టాభి, తూములూరి లక్ష్మీ నరసింహారావు కిలారు అనిల్ కుమార్, పుచ్చకాయల సోమిరెడ్డి, కాపా సుధాకర్, ప్రభావతి రెడ్డి, రామ సహాయం హరిత రెడ్డి, దామా స్వరూప, మూడుముంతల గంగరాజు యాదవ్, రంగా జనార్ధన్, కిలారు వెంకట రమణ, బచ్చలకూర నాగరాజు, జెర్రిపోతుల అంజనీ కుమార్, కల్వకుంట్ల గోపాల్, బాణాల లక్ష్మణ్, ఏలూరి శ్రీనివాస్, పమ్మి అశోక్, మస్తాన్, బెజ్జం గంగాధర్, ప్రతిభా రెడ్డి, మద్దినేని రమేష్, బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ శేషగిరి తదితరణాయకులు పాల్గొన్నారు.




## త్రివేణి పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

లక్ష్మీ   మ్రదేవిపల్లి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:



స్థానిక లక్ష్మీ   మ్రదేవిపల్లిలోని త్రివేణి పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని ప్రతిమకు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో అలరించారు. చిన్నారుల రాధాకృష్ణ నృత్యాలు, ఉట్లోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ మాట్లాడుతూ, శ్రీకృష్ణుని జీవితం, బోధనల నుంచి విద్యార్థులు ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి సద్గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు బోధించిన కర్మయోగం, నిస్వార్థంగా విధులను నిర్వర్తించాలనే సందేశాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో త్రివేణి పాఠశాలల సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్స్ వి. సూర్యనారాయణ మూర్తి, శ్రీనివాస్ సింగ్, నేతాజీ, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఒకేషనల్ విద్యార్థులకు క్లినికల్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇంటర్మీడియట్ ఎంఎల్టీ, ఎంపీహెచ్డబ్ల్యూ(ఎఫ్) వొకేషనల్ కోర్సుల్లో మార్చి 2020 నుంచి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒక సంవత్సరం క్లినికల్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి హెచ్. వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (కొత్తగూడెం), భద్రాచలం, మణుగూరు, ఇల్లందు, పాల్వంచ, బూర్గంపహాడ్, అశ్వారావుపేట, చర్లలోని టీవీవీపి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ క్లినికల్ శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థులు మాత్రమే ఆయా ఆసుపత్రుల పేరుతో రూ.1,000 డీడీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపిక కాని విద్యార్థులు సైతం తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చదివిన ఆసక్తి గల విద్యార్థులు తమ బయోడేటా, ఆధార్ కార్డు, ఇంటర్మీడియట్ మెమో, ఇంటర్మీడియట్ స్టడీ సర్టిఫికెట్, ఎస్ఎస్సీ మెమో జిరాక్స్ ప్రతులను జతచేసి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయం, సీఏఓ, రూమ్ నం. ఎఫ్(13), ఐడిఓసీ కార్యాలయం (కలెక్టరేట్)లో ఈనెల 5 నుంచి 11 వరకు సాయంత్రం 5 గంటలలోపు స్వయంగా అందజేయాలని సూచించారు.

# ఏఐటీయూసీ పోరాటంతో కార్మికులకు కీలక ప్రయోజనాలు

**కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి**

కొత్తగూడెం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:




కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు, ఆర్ఎల్సీ సమక్షంలో జరిగిన చర్చలు, నిరంతర పోరాటం ఫలితంగా సింగరేణి యాజమాన్యం పలు కీలక డిమాండ్లపై అంగీకారం తెలిపిందని ఏఐటీయూసీ కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.వి. రమణమూర్తి తెలిపారు. గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.జూన్ 8న ఏఐటీయూసీ సమ్మె నోటీసు ఇచ్చిందని, అనంతరం యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపినా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటాన్ని కొనసాగించామని తెలిపారు.ఏఐటీయూసీ ఒత్తిడితో కార్మికులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించే పలు అంశాలపై అగ్రిమెంట్లు జరిగాయన్నారు.ప్రధానంగా పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యమే భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం, 2025-26 వాస్తవ లాభాల ప్రకటన, ట్రాన్స్‌ఫర్ల మూడేళ్ల నిబంధనలో మార్పు, అర్హులైన మైనింగ్ స్టాఫ్, మైనింగ్ సర్దార్లకు ఓవర్‌మెన్ ప్రమోషన్లు వంటి అంశాలపై అంగీకారాలు సాధించామని పేర్కొన్నారు.అలాగే హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో మార్పులు, సింగరేణి విద్యాసంస్థల్లో సీబీఎస్ఈ సిలబస్, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం కల్పించే అంశాలపై కూడా అంగీకారం కుదిరిందన్నారు. ఖాళీ పోస్టుల భర్తీ, క్యాడర్ స్కీమ్ సమస్యల పరిష్కారం, మెడికల్ ఫిట్ అయిన 149 మంది డిపెండెంట్లకు నెలలోపు ఆఫీస్ ఆర్డర్లు జారీ చేయడం, సొంత ఇంటి పథకం, సేఫ్టీ మెటీరియల్ సరఫరా, సూటబుల్ సర్ఫేస్ ఉద్యోగాలు తదితర అంశాలపై కూడా యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని తెలిపారు.కొత్త గనులతోనే సింగరేణి భవిష్యత్తు సింగరేణి సంస్థ అభివృద్ధికి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని, కొత్త బొగ్గు గనులు కేటాయించే విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని రమణమూర్తి కోరారు. బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి చురుగ్గా పాల్గొని కొత్త బ్లాకులు సంస్థకు దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు.కొత్త గనులు,ఉపాధి అవకాశాలు, కార్మిక సంక్షేమం,ఉద్యోగ భద్రతతోనే సింగరేణి భవిష్యత్తు బలోపేతమవుతుందన్నారు. కార్మికుల సమస్యలను ప్రచారానికే పరిమితం చేయకుండా పోరాటాల ద్వారా పరిష్కారాలు సాధించడమే ఏఐటీయూసీ విధానమని స్పష్టం చేశారు.ఏఐటీయూసీ సాధిస్తున్న విజయాలను కొన్ని సంఘాలు ఓర్వలేక విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని రమణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి రాము, ఆఫీస్ బ్యారర్స్ నితిన్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు

## ఆదిదేవుడు గణేషుడు సకల మానవాళికి రక్షకుడు

**కొత్వాల శ్రీనివాసరావు**

పాల్వంచ,సెప్టెంబర్ 3,ప్రభాత వార్త:

ఆదిదేవుడు శ్రీ గణేశుడు సకల మానవాళికి రక్షకుడని,గణపతిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సకల విఘ్నాలు తొలగుతాయని డిసీఎంఎస్ మాజీ చైర్మన్,రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్,కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.పాల్వంచ పట్టణంలోని 40వ డివిజన్ రాంనగర్‌లో గణపతి నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లలో భాగంగా రాంనగర్ యూత్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కర్రపూజ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఏ శుభకార్యాన్నైనా విఘ్నాలు లేకుండా విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రజలు ముందుగా వినాయకుడిని ఆరాధించడం భారతీయ సంస్కృతిలో విశిష్ట సంప్రదాయమని పేర్కొన్నారు.గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వాహకులు నియమనిష్ఠలతో నిర్వహించి, సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించాలని ఆయన ఆకాంక్షి   ంచారు. నిర్వాహకులు దాసరి సురేష్ యాదవ్,ఎ ం.డి. అన్వర్, కార్పొరేటర్లు అడుసుమిల్లి సాయిబాబు,గుణచరిత్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజుగౌడ్,40వ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి పెండ్యాల   శ్రీనివాసరావు,సూరత్   మురళీగాంధీ,వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, దొప్పలపూడి సురేష్,మణి,బూసి శ్రీను, యాటా నాని,దాసరి శంకరన్న,దాసరి లక్ష్మి   మ్మ, సునీత పాల్గొన్నారు.




## డి.ఎస్. లోకేశ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్

కొత్తగూడెం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:



ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఉన్నతస్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శిగా డి.ఎస్. లోకేశ్ కుమార్ ,రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి (రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు) రాజీవ్ గాంధీ హనుమంతు భద్రాద్రి ఐడిఓసికి గురువారం చేరుకున్నారు. వీరిని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ సాదరంగా ఆహ్వానించి మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల మొక్కను అందజేశారు. అనంతరం ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో జరుగుతున్న భూ సర్వే,సాదా బైనమా, రెవిన్యూ సదస్సులు, తదితర అంశాలపై అధికారులతో ఐడిఓసి లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రివ్యూ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ రీ సర్వేను సకాలంలో పూర్తిచేయాలని అధికారులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సమావేశంలో ఖమ్మం కలెక్టర్ దివాకర్, భద్రాద్రి జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట్,కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ కుమార్,ఉమ్మడి జిల్లాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన

లక్ష్మీ   మ్రదేవిపల్లి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:



బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ మంత్రి కొత్తగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ వనమా వెంకటేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు లక్ష్మీ   మ్రదేవిపల్లి మండలం లో కొట్టి వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో రైతులతో మమేమకమై బీమా ఇవ్వాలని,అంబ సత్రం భూములకు యూరియా ఇవ్వాలని, యూరియా యాప్ ఎత్తివేయాలని, రైతులకు 24 గం. గంటలు కరెంటు ఇవ్వాలని ధర్నా నిర్వహించిన అనంతరం అగ్రికల్చర్ ఆఫీసర్ కు మెమరండం ఇవ్వడం జరిగింది .. కొట్టి వెంకటేశ్వరరావు, గడ్డిగుట్ట సురేష్,లావణ్య, వెంకటేష్, మాజీ సర్పంచ్ రవి, ఉప సర్పంచ్ బట్టు రవి, బద్రు, బాలు, పొగాకు వెంకటేశ్వర్లు, తరాల దాము, రమేషు, మాజీ ఉపసర్పంచ్ వినోద్, శివ మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్స్‌కు ఎంపిక పోటీలు

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ, హైదరాబాద్ ఆదేశాల మేరకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్స్ 2025-26కు సంబంధించి జిల్లా స్థాయి ఎంపిక పోటీలను విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి తెలిపారు. పాల్వంచలోని మినిస్టర్ క్యాంప్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, యోగా, పవర్ లిఫ్టింగ్, కోకో తదితర క్రీడల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు.



అలాగే పాల్వంచ కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి మైదానంలో పురుషులు, మహిళలకు షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, పురుషులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సుమారు 80 మంది ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచి అర్హత సాధించిన 40 మంది ఉద్యోగులను ఈ నెలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరఫున పంపనున్నట్లు పరంధామరెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు, రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షి   ంచారు.

# భద్రాద్రికి రైలుబాట



## పాండురంగాపురం-మల్కన్‌గిరి రైల్వే లైన్‌లో సాకేతపురి వరకు పనులకు గ్రీన్‌సిగ్నల్

**అభివృద్ధికి తొలి అడుగు**

- సుమారు 16 కి.మీ. మేర రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి..
- మంత్రి విజ్ఞప్తిపై తక్షణమే సానుకూలంగా స్పందించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్
- పాండురంగాపురం-సాకేతపురి మధ్య భూసేకరణ చేపట్టి రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్రం సిద్ధం
- రైల్వే కనెక్టివిటీతో భద్రాచలానికి ఆధ్యాత్మిక పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు

**కొత్తగూడెం, ప్రభాతవార్త :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి కీలకమైన పాండురంగాపురం- మల్కన్‌గిరి రైల్వే లైన్‌కు మరోసారి కదలిక వచ్చింది. వివిధ కారణాలతో పూర్తి ప్రాజెక్టు ఆలస్యమవుతున్న నేపథ్యంలో.. ప్రస్తుత దశలో పాండురంగాపురం నుంచి మధ్యలోని సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ. రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి సాను కూలంగా స్పందించి, ఈ మార్గంలో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



### పూర్తి ప్రాజెక్టుకు పలు అవరోధాలు..

రైల్వే మంత్రితో జరిగిన చర్చలో పాండురంగాపురం-మల్కన్‌గిరి రైల్వే లైన్ ప్రస్తుత పరిస్థితిని మంత్రి తుమ్మల వివరించారు. గతంలో రైల్వే మంత్రులుగా పనిచేసిన లాలూ ప్రసాద్ యాదవ్, మమతా బెనర్జీ, సురేశ్ ప్రభు, పీయూష్ గోయల్ హయాంలోనూ ఈ రైల్వే లైన్ ప్రతిపాదనకు అనుకూలత లభించినప్పటికీ.. వివిధ కారణాలతో పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదని తెలిపారు. భూసేకరణ, అటవీశాఖ అనుమతులు, గోదావరి వంతెనతో పాటు ఇతర రైల్వే వంతెనల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియలు పూర్తి ప్రాజెక్టుకు ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని మంత్రి వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిష్కరించి పాండురంగాపురం-మల్కన్‌గిరి పూర్తి రైల్వే లైన్‌ను నిర్మించేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

### సాకేతపురి వరకు ముందుగా పనులు..

అయితే పాండురంగాపురం నుంచి సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ. మేర రైల్వే లైన్ నిర్మాణానికి పెద్దగా అవరోధాలు లేనందున.. ఈ దశలో ఆ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి తుమ్మల కోరారు. పాండురంగాపురం-సాకేతపురి మధ్య రైల్వే లైన్‌కు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి, అవసరమైన భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి తెలిపారు.

### తుమ్మల విజ్ఞప్తికి తక్షణ స్పందన..

మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. పాండురంగాపురం-సాకేతపురి మార్గంలో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులను ఆదేశించారు. దీంతో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న భద్రాద్రి ప్రాంత రైల్వే కనెక్టివిటీకి తొలి అడుగు పడినట్లయింది. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఈ రైల్వే మార్గం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది.

సాకేతపురి వరకు రైల్వే సౌకర్యం అందుబాటులోకి వస్తే భద్రాచలం ప్రాంతానికి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. రైల్వే కనెక్టివిటీతో భద్రాచలంలో ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త ఊపు వచ్చే అవకాశం ఉంది. భద్రాచలం, గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యాటక కార్యకలాపాలు విస్తరించడంతో పాటు.. భక్తులు, పర్యాటకుల రాక పెరగడం ద్వారా స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు మెరుగుపడనున్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పారిశ్రామిక రంగానికి కూడా రైల్వే కనెక్టివిటీ కీలకంగా మారనుంది. సింగరేణి, బీపీఎల్, వాటర్ ప్లాంట్లు, కేటీపీఎస్ తదితర పరిశ్రమలకు ముడిసరుకు, ఉత్పత్తుల రవాణా మరింత సులభతరం కానుంది. రైల్వే సౌకర్యం అందుబాటులోకి రావడంతో కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు ఆకర్షించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడనుంది.

### భూసేకరణకు రాష్ట్రం సిద్ధం..

కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించిన నేపథ్యంలో పాండురంగాపురం-సాకేతపురి మధ్య భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, అవసరమైన భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. పాండురంగాపురం-మల్కన్‌గిరి రైల్వే లైన్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు ఒక్కొక్కటిగా తొలగుతున్న క్రమంలో.. ఈ దశలో సాకేతపురి వరకు రైల్వే లైన్ అందుబాటులోకి రావడం భద్రాద్రి ప్రాంత అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది. ఆధ్యాత్మిక పర్యాటకం, పారిశ్రామిక ప్రగతి, స్థానిక ఉపాధి, వ్యాపార అవకాశాలకు ఈ రైల్వే కనెక్టివిటీ మరింత బలాన్నివ్వనుంది.

# పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు

**భవిష్యత్తులో ఉద్యోగులుగా, అధికారులుగా స్థిరపడాలన్నదే నా ఆకాంక్ష..**

**పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ రైట్ ఛాయిస్ ఆధ్వర్యంలో ఫ్రీ పోలీస్ కోచింగ్ క్యాంప్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి..**

**నిరుద్యోగ అభ్యర్థులకు మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పిస్తానని అభయం..**



**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** పట్టుదలతో ప్రయత్నిస్తే, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే.. నేటి నిరుద్యోగ యువతీ, యువకులు భవిష్యత్తులో ఉద్యోగులుగా, అధికారులుగా స్థిరపడొచ్చని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. పొంగులేటి స్వరాజ్యం రాఘవరెడ్డి (పీఎస్ఆర్) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైట్ ఛాయిస్ నిర్వహణలో నగరం లోని బైపాస్ రోడ్డులో గల రామకృష్ణ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై ఫ్రీ కోచింగ్ క్యాంప్ ను గురువారం ప్రారం భించారు. కలెక్టర్ దివాకర, తదితర ఉన్నతా ధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రసం గిస్తూ.. గతంలో 2016లో 2,300 మందికి ఇలానే శిక్షణ ఇప్పించగా.. 350 మందికి పైగా ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని, ఆరోజు..వారి తల్లిదండ్రుల కళ్లలో చూసిన ఆనంద భాష్పాలు తానెప్పటికీ మరువలేనని అన్నారు. మీ శీనన్నగా.. అండగా ఉంటామధ్యతరగతి యువతీ యువకుల ఉన్నత భవిష్యత్తు కోసం తన వంతుగా సహకారం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని అన్నారు. ఉత్తమ ఫ్యాకల్టీతో, రీజనింగ్ పుస్తకాలతో ఏర్పాటు చేసిన ఈ ఫ్రీ కోచింగ్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ అభ్యర్థులెవరికీ ఇబ్బంది కలగకుండా.. మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పిస్తున్నట్లు ప్రకటించారు. రైట్ ఛాయిస్ నిర్వాహకులు.. మెండెం కిరణ్ కుమార్ కృషి, తనతో ఉన్న అనుబంధం మరువలేనిదని మంత్రి పొంగులేటి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కోచింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో..: మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వి. సీతారాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొర్రా రాజశేఖర్, అడిషనల్ డీసీపీ రామానుజం, ఐఎఎస్ ట్రైనర్ ఆకెళ్ళ రాఘవేంద్రరావు, రీజనింగ్ ఫ్యాకల్టీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ఆదివాసీ కుటుంబాలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు



**గిరిజన గ్రామాల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు**

**చిన్నారుల సందడితో పండుగకు ప్రత్యేక శోభ**

**ఆదర్శప్రాయుడు శ్రీకృష్ణుడు: ఐటీడీఏ పీవో బి.రాహుల్, సబ్‌కలెక్టర్ మృనాల్ శ్రేష్ట**

**భద్రాచలం, సెప్టెంబర్ 3(ప్రభాతవార్త)**
ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజన కుటుంబాలకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్, సబ్‌కలెక్టర్ మృనాల్ శ్రేష్ట శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన గ్రామాల్లో పనిచేస్తున్న అధికారులు, రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖల ఉద్యోగులు, విద్యార్థినీ విద్యార్థులకు కూడా వారు శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీకృష్ణుని జన్మదినాన్ని శ్రీకృష్ణ జన్మాష్టమి, గోకులాష్టమిగా పిలుస్తారని పేర్కొన్నారు. హిందూ పురాణాల ప్రకారం శ్రీకృష్ణుడు శ్రీమహావిష్ణువు ఎనిమిదో అవతారంగా కొలువబడుతున్నారని తెలిపారు. జన్మాష్టమి సందర్భంగా భక్తులు ఉపవాసం ఉండి సాయంత్రం శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. పండ్లు, అటుకులు, బెల్లం, వెన్న, పెరుగు, మీగడ తదితరాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తారని పేర్కొన్నారు. ద్వాపర యుగంలో జన్మించిన శ్రీకృష్ణుడు నేటి తరానికి కూడా ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. చిన్నారులను చిన్ని కృష్ణుడు, అల్లరి కృష్ణుడిగా భావిస్తూ తల్లిదండ్రులు ప్రేమగా పిలుచుకోవడం పండుగ ప్రత్యేకతగా పేర్కొన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణలో అలంకరించి వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామస్తులంతా కలిసి ఉట్టి కొట్టి, చిన్నారులతో సందడి చేస్తూ జన్మాష్టమి వేడుకలను ఆనందంగా జరుపుకుంటారని చెప్పారు. శ్రీకృష్ణుని బోధనలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని వారు ఆకాంక్షించారు. ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుకుంటూ మరోసారి జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

# సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్



**రాజీ కేసుల పరిష్కారానికి సువర్ణావకాశం**

**లోక్ అదాలత్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి**

**ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వరూప కాటం**

**ఇల్లందు, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**
ప్రజలకు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో న్యాయం అందించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వరూప కాటం సూచించారు. గురువారం సాయంత్రం ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఇల్లందు కోర్టు పరిధిలోని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి స్వరూప కాటం మాట్లాడుతూ, ఈ నెల 12న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరు పక్షాలను సమన్వయం చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరస్పర అంగీకారంతో పరిష్కారమైతే సమయం, డబ్బు, శ్రమ ఆదా అవుతాయని ఆమె తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి, ప్రజలకు లోక్ అదాలత్ ప్రాముఖ్యతను వివరించి ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ ద్వారా పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన సివిల్, కుటుంబ, చెక్కు బౌన్స్, మోటారు ప్రమాద పరిహారం, బ్యాంకు రుణాలు, విద్యుత్ బిల్లులు తదితర కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది. కోర్టు ఫీజు తిరిగి లభించడం, తీర్పు తుది నిర్ణయంగా ఉండడం, అప్పీల్ అవసరం లేక పోవడం వంటి ప్రయోజనాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి. ఈ సమావేశంలో కోర్టు సూపరింటెండెంట్ రామకృష్ణ, ఇల్లందు కోర్టు పరిధిలోని పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**కంటి దానంపై ప్రజల్లో చైతన్యం పెంచాలి**

**డీఎంహెచ్‌ఓ డాక్టర్ తుకారామ్ రాథోడ్**



**పాల్వంచ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:**
పోషకాహార వారోత్సవాల సందర్భంగా ప్రజల్లో సమతుల ఆహారం, పోషకాహారం ప్రాధాన్యతపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ తుకారామ్ రాథోడ్ అధికారులను ఆదేశించారు. అలాగే 41వ జాతీయ కంటి దాన పక్షోత్సవాన్ని పురస్కరించుకుని కంటి దానం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ వివరించి, ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. పాల్వంచలోని డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు జరుగుతున్న పోషకాహార వారోత్సవాల్లో సమతుల ఆహారం ఆరోగ్యానికి పునాదిగా నిలుస్తుందని చెప్పారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, కిశోర బాలికలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పాలు, గుడ్లు వంటి పోషకాహారాన్ని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని, జంక్ ఫుడ్‌తో పాటు అధిక నూనె, ఉప్పు, చక్కెర వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తున్న జాతీయ కంటి దాన పక్షోత్సవం సందర్భంగా కంటి దానం ద్వారా కార్నియా సంబంధిత అంధత్వంతో బాధపడుతున్న వారికి చూపును అందించే అవకాశం ఉంటుందని వివరించారు. కంటి దానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, కుటుంబ సభ్యులను కూడా ఇందుకు ప్రోత్సహించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సిబ్బందికి పోషకాహారం, కంటి దానం అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను గ్రామస్థాయి వరకు సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డాక్టర్ తుకారామ్ రాథోడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శ్రీధర్, ఐడీఎస్‌పీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బానోత్ ప్రసాద్, ఫార్మసీ అధికారులు, ఎంపీహెచ్‌ఏలు, మలేరియా నోడల్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



**మణుగూరు ఏరియా ఏజీఎం (పర్సనల్ ) ఎస్.రమేష్**

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 03**

సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా జీఎం కార్యాలయంలో గురువారం ఏరియా పర్సనల్ విభాగం అధికారులతో ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగులకు సంక్షేమ సేవలు అందించడంలో ప్రతీ అధికారి, సిబ్బంది పారదర్శకత, నిబద్ధతతో పనిచేయాలని అన్నారు.

ఈ సందర్భంగా 2025 క్యాలెండర్ సంవత్సరంలో నమోదైన గ్రీవెన్సులు, డిసిప్లినరీ కేసులు, పెండింగ్ ఎగ్జిట్ ప్రాసెసింగ్, ఎగ్జిట్ మెడికల్ విచారణలపై సమీక్ష జరిపారు. పీఎస్3 బిల్లులు అండ్ నియామకాలు: పీఎస్3, పీఎఫ్, సీఎంపీఎఫ్, కారుణ్య నియామకాల ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల క్రెడిట్ సేవలు, హెచ్ఆర్ఏ, పెన్షన్ డిజిటలైజేషన్ పనులను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు. కొత్తగా చేరిన కాంట్రాక్ట్ కార్మికుల వివరాలను వెబ్ సైట్ నందు నమోదు చేసి, ఆధార్ ఆన్ బోర్డింగ్ వేగవంతం చేయాలన్నారు. ఉద్యోగులకు సంబంధించిన పీడబ్ల్యూఈలు, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ వంటి వివిధ బ్యాంకుల సేవలు సకాలంలో అందుబాటులో ఉంచాలన్నారు. ఏ సమస్యనూ పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్లు డి. శ్యామ్ ప్రసాద్, కె. శ్రీనివాస్, జి. రామకృష్ణ, పి. నరేష్, ఇతర పర్సనల్ అధికారులు పాల్గొన్నారు.

# పెచ్చులూడి.. శిథిలావస్థలో.. పంచాయతీ భవనం



**కూల్చివేతకు అధికారుల ఆదేశాలు**

**నూతన భవనం ఎప్పుడు?**

**దరఖాస్తు చేసినా అధికారుల స్పందన శూన్యం**

**అశ్వాపురం, ప్రభాతవార్త, సెప్టెంబర్ 03**
అశ్వాపురం మండలంలోని నెల్లిపాక గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. భవనం పైకప్పు, గోడల నుంచి పెచ్చులు ఊడిపడుతూ క్రమంగా కూలిపోతుండటంతో సిబ్బంది, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భవనం పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో దీనిని శిథిలం చేయాలని పంచాయతీరాజ్ అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే పాత భవనాన్ని తొలగిస్తే పంచాయతీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ప్రత్యామ్నాయ భవనం లేకపోవడం మరో సమస్యగా మారింది.

నెల్లిపాక గ్రామ పంచాయతీకి నూతన భవనం నిర్మించేందుకు ఇప్పటికే పంచాయతీ పాలకవర్గం సర్పంచ్ ముంద్రు రామ కృష్ణ నేతృత్వంలో అధికారులకు దరఖాస్తు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో గ్రామస్థుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఒకవైపు పాత భవనం ప్రమాదకరంగా మారడం, మరోవైపు కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో పంచాయతీ పాలనకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి నెలకొంది. ప్రత్యామ్నాయ భవనం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారిన భవనంలో సిబ్బంది విధులు నిర్వహించడం, వివిధ పనుల కోసం ప్రజలు అక్కడికి రావడం ఆందోళన కలిగిస్తోంది. ఏదైనా ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని, పాత భవనాన్ని తొలగించే ముందు తాత్కాలికంగా ప్రత్యామ్నాయ భవనం ఏర్పాటు చేయడంతో పాటు, నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రైతు రాజ్యం కాదు.. రావణ రాజ్యం

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ ధ్వజం

**అశ్వాపురం.ప్రభాతవార్త, సెప్టెంబర్ 03:**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తీవ్ర అన్యాయం చేసిందని బీఆర్ఎస్ అశ్వాపురం మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్ ఆరోపించారు.రైతు సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో రైతుల కష్టాలు మరింత పెరిగాయని విమర్శించారు.రైతు రాజ్యం వస్తుందని ఆశిస్తే,రావణ రాజ్యం వచ్చింది అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు.రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోకుండా రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రైతు బీమా పథకాన్ని ఎత్తివేసారని, రుణమాఫీ అసంపూర్తి గా చేశారన్నారు.గతంలో కేసీఆర్ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేసిన రైతు బీమా వంటి పథకాలు రైతు కుటుంబాలకు భరోసా కల్పించాయని అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బీమా విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు.అదే విధంగా రైతులకు హామీ ఇచ్చిన రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు.ఎన్నికల సమయంలో రైతులకు సంవత్సరానికి రైతు భరోసా కింద రూ.15 వేల చొప్పున అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర,సన్న వడ్లకు రూ.500 బోనస్,కౌలు రైతులకు రైతు భరోసా వంటి హామీలు ఇచ్చినా వాటి అమలులో ప్రభుత్వం విఫలమైందని అన్నారు.కౌలు రైతులకు ఇస్తామన్న



భరోసా ఏదని,రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీ అమలు పరిస్థితి ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని, రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయడం లేదని బీఆర్ఎస్ నాయకుడు ఆరోపించారు. ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులు పడుతున్నారని,సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి చివరకు ఒక సీజన్ కు మాత్రమే పరిమితం చేశారని, దాన్ని ఈ సంవత్సరం ఏడు రకాల వడ్ల ను సాగు చేసిన వారికే అంటూ బోనస్‌ను బోగస్‌గా మార్చారని విమర్శించారు.యూరియా కోసం రైతుల అవస్థలు పడుతున్నారని ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని కోడి అమరేందర్ యాదవ్ అన్నారు.పంటల సాగు కీలక దశలో ఎరువులు సకాలంలో అందించాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.యూరియా కోసం యాపులు పెట్టిన రాబందు ప్రభుత్వం అంటూ ఘాటుగా విమర్శించారు. రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో, సరిపడా అందించాలని డిమాండ్ చేశారు.మారెళ్లపాడు ప్రాజెక్టును పూర్తి చేయాలి.అశ్వాపురం మండల రైతాంగానికి సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పనుల్లో జాప్యం కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే రైతుల భూములను నిషేధిత జాబితాలో చేర్చారని,ఎన్నికల అప్పుడు పట్టాలు ఇస్తానన్న ప్రభుత్వం నేడు చేతులెత్తేసిందని, తక్షణమే నిషేధిత భూముల జాబితాలో సంబంధిత సర్వే నెంబర్లను తొలగించాలని, నెల్లిపాక శివారులోని సుమారు 1,000 నుంచి 1,100 ఎకరాల భూములకు సంబంధించిన 190 నంబర్ సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి,సీనియర్ నాయకులు సూదిరెడ్డి గోపిరెడ్డి,కంచుగట్ల వీరభద్రం,మొగిళ్ల వీరారెడ్డి,చిలక వెంకటరామయ్య,తూము రాఘవులు,సర్పంచ్ లు మర్రి సంధ్య, ముంద్రు రామకృష్ణ,కోండ్రు సోమయ్య,ముర్రం సమ్మయ్య,లకావత్ రామారావు,మండల యువజన విభాగం అధ్యక్షుడు గద్దల రామకృష్ణ ఉపసర్పంచ్ లు చలమల్ల శివారెడ్డి,దేవన బోయినమహేష్,గాడిద మహేష్,నాయకులు గొర్రె ముచ్చు వెంకటరమణ, బొర్రా శ్రీను,గుంపెన శ్రీను,నజీర్ సోను,కడారి వేణు,శివారపు డాక్టర్ బాబుఇసంపల్లి పున్నారావు,తదితర నాయకులు,రైతులు,కార్యకర్తలు పాల్గొన్నారు.




## ముత్యాలమ్మ ఆలయ నిర్మాణ దాతలకు సన్మానం



**అశ్వాపురం,ప్రభాతవార్త,**

సెప్టెంబర్ 03:వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి విశేషంగా సహకరించిన ఆలయ నిర్మాణ దాతలు దంపతులు చాగంటి శ్రీనివాస్ రెడ్డి,చాగంటి చాముండేశ్వరిలను గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా సన్మానించారు.ఆలయ నిర్మాణానికి విశేష కృషి చేసిన దాత దంపతులను, స్థలదాత సున్నం లక్ష్మీ లను గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ పాలకవర్గం,వెంకటాపురం యూత్ సభ్యులు,గ్రామ ప్రజలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయ నిర్మాణం గ్రామ ప్రజల భక్తికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచిందన్నారు.గ్రామ ఆధ్యాత్మిక అభివృద్ధికి తమ వంతు సహకారం అందించిన దాత దంపతుల సేవలను కొనియాడారు. వారి కుటుంబంపై శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. సన్మాన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, వెంకటాపురం యూత్ సభ్యులు, మహిళలు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయం గ్రామ ప్రజలందరికీ భక్తి, విశ్వాసం, ఐక్యతకు చిరస్థాయిగా నిలవాలని గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకవర్గం, యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు ఆకాంక్షించారు.

# ఎక్సలెంట్,ఎమిలీ పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**అశ్వాపురం, ప్రభాతవార్త సెప్టెంబర్ 03:**

అశ్వాపురంలోని ఎక్స లెంట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణుడు,గోపికల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. ఆటపాటలతో సందడి చేస్తూ వేడుకలకు మరింత శోభ తీసుకొచ్చారు.చిన్నారులతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థుల సంప్రదాయ వేషధారణలు, ఆటపాటలు తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా ఎమిలీ పాఠశాల కరస్పాండెంట్ ములకలపల్లి గోపీనాథ్,ఎక్స లెంట్ పాఠశాల కరస్పాండెంట్ లెనిన్ విజయ్ కుమార్



మాట్లాడుతూ శ్రీకృష్ణుడి గొప్పతనాన్ని,పండుగల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలని సూచించారు.చిన్నారుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.పాఠశాల



ఉపాధ్యాయులు చిన్నారులను ప్రోత్సహిస్తూ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పాఠశాలల కరస్పాండెంట్ లు లెనిన్ విజయ్ కుమార్, ములకలపల్లి గోపీనాథ్ లు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ



**అశ్వాపురం, ప్రభాతవార్తసెప్టెంబర్ 03:**

బీఆర్ఎస్ పార్టీ పినపాక మండల అధ్యక్షుడు, యువనేత,మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రధాన అనుచరుడు పగడాల సతీష్ రెడ్డి జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు.మండల యూత్ ప్రెసిడెంట్ గద్దల రామకృష్ణ ఆధ్వర్యంలో జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.ఇందులో భాగంగా అశ్వాపురంలోని అరిఫా రోషిని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు 50 కేజీల బియ్యం, పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మండల యూత్ ప్రెసిడెంట్ గద్దల రామకృష్ణ మాట్లాడుతూ పగడాల సతీష్ రెడ్డి పార్టీ పట్ల ఎంతో అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. నిరంతరం ప్రజలకు,పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. పినపాక మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు,ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నారని అన్నారు.సతీష్ రెడ్డి ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని గద్దల రామకృష్ణ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు నజీరు సోను,పవన్, రమేష్,రామకృష్ణ, యూత్ సభ్యులు,అరిఫా రోషిని వృద్ధాశ్రమం నిర్వాహకులు షేక్ మీరాజ్ తదితరులు పాల్గొన్నారు

# నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిన చెత్త తొలగింపు

**అశ్వాపురం,ప్రభాతవార్త, సెప్టెంబర్ 03:**

వెంకటాపురం గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటాపురం గ్రామం నుంచి ముస్లిం గుంపు వైపు వెళ్లే వాగులో శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు.గ్రామం సమీపంలోని వాగుపై నిర్మించిన బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చిన చెత్తచెదారం,వ్యర్థాలను తొలగించారు.వాగులో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా,వర్షాల సమయంలో నీరు సజావుగా ప్రవహించేలా ఈ శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామపంచాయతీ సిబ్బంది తెలిపారు.పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మడకం మూలమ్మ,పంచాయతీ కార్యదర్శి



ప్రతాప్,వార్డు సభ్యులు కారం సుజాత,తాటి శ్రీను, తాటి నరేష్, మడకం శరత్,గ్రామ పెద్దలు మడకం బద్రి తదితరులు పాల్గొన్నారు.గ్రామ ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, వాగుల్లో నీటి ప్రవాహం సజావుగా ఉండేలా చర్యలు తీసుకోవడం గ్రామపంచాయతీ ప్రధాన బాధ్యత అని వారు తెలిపారు.

# మార్గదర్శినిలో మురిసిన ముద్దుల గోపాలులు

**శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహణ..**

**ఉట్టి వేడుకల్లో చిన్నారుల ఉత్సాహం**

ఇల్లందుఅర్బన్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:

శ్రీ కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా పట్టణంలోని మార్గదర్శిని స్కూల్ ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. చిన్నారులు శ్రీకృష్ణుడు,



రాధ, గోపికలు, యశోద, బలరాముడు తదితర పురాణ పాత్రల వేషధారణలో ఆకట్టుకుని పాఠశాల ప్రాంగణాన్ని బృందావనాన్ని తలపించేలా మార్చారు. విద్యార్థుల సందడి, భక్తి




గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో చిన్నారులు శ్రీకృష్ణుని బాలలీలలను ప్రతిబింబించే నృత్యాలు, పాటలు, వేషధారణ ప్రదర్శనలతో అందరినీ అలరించారు. అనంతరం సంప్రదాయ ఉట్టి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించగా, విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొని వేడుకలకు మరింత శోభ తీసుకొచ్చారు. పాఠశాల డైరెక్టర్లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చిన్నారులకు పరిచయం చేయడమే లక్ష్యంగా ప్రతి పండుగను విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించడం మార్గదర్శిని స్కూల్ ఆనవాయితీ అని తెలిపారు. పండుగల ద్వారా పిల్లల్లో సంస్కృతి, సాంప్రదాయాల పట్ల గౌరవభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు,




తల్లిదండ్రులు, ప్రజలందరికీ శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు వేడుకల్లో పాల్గొని చిన్నారులను అభినందించారు.

# వినాయక విగ్రహాల పెరుగుదల.

**.పర్యావరణానికి పెనుముప్పు**

**ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ రంగులతో**

**జలచరాలకు ముప్పు.**

**భక్తి మాటున పెరుగుతున్న కాలుష్యం.**

**వినాయక ఉత్సవాలలో పోటీ..**

**పర్యావరణం పై ప్రతికూల ప్రభావం.**

**నినాదాలకే పరిమితం అవుతున్న**

**పర్యావరణం హితం.**

ఏన్కూరు, సెప్టెంబర్ 03, ప్రభాత వార్త

:వినాయక చవితి వచ్చిందంటే.. గ్రామాలు..పట్టణాలు..సందడిగా మారుతున్నాయి.గణనాథుడి విగ్రహాలు ఏర్పాటు లో..భక్తి కంటే పోటీ తత్వం పెరుగుతుండటం పర్యావరణ పై తీవ్ర ప్రభావం చూపుతుంది.పర్యావరణ పరిరక్షణే ధ్యే యంగా మనము మొక్కలు నాటుతున్నాం.పరిసరాలను మనం కాపాడితే..అది మనల్ని కాపాడతాయి అన్నా భా వనలో నుంచి ఇది పుట్టింది.సెప్టెంబర్ 14వ తేదీ నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారం భం కానున్నాయి.వీధి వీ ధిన విఘ్నేశ్వరుడు ప్రతిమలను ఏర్పాటు చేసి..పత్రి..ఫలాలతో ఏకదంతుడిని పూజిస్తాం.వినాయక చవితి సందర్భ ముగా..వివిధ రంగులతో గణేష్ విగ్రహాలు..ప్రతిష్టించడం..వాటిని జలవనరులలో నిమగ్నం చేయడం ఆనవాయితీ. అయితే ఆయా విగ్రహాలలో అత్యధికంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ తో తయారు చేసినవే ఉంటున్నాయి.మట్టి విగ్రహాల ను వాడాలని..కొన్ని ఏళ్లగా ప్రచారం జరుగుతుంది.కానీ ప్రజలలో మాత్రం అవగాహన పెరగడం లేదు.ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ వల్ల కలిగే నష్టాలు తెలిసిన వారు సైతం ఆ విగ్రహాలను పూజించడం గమనార్హ ము.ఆయా సమయాలలో మట్టి విగ్రహాలు కనిపించకపోవడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది.వారం రోజులు ముందే గుర్తు వస్తున్న ప్రచారం..ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలు వాడటం వల్ల నష్టాలు ఉన్నాయన్నా ఉద్దేశంతోనే దాని వాడకాన్ని తగ్గించాలని ప్రచా రం చేస్తున్నారు.కానీ ఆ ప్రచారం కేవలం గణేష్ నవరాత్రులకు ఒక వారం ముందు నుంచో..లేక ఉత్సవాలు ప్రారంభ మయ్యే ముందు రోజు నుంచో





జరుగుతుంది.ప్రచారం ప్రారంభించే సమయానికి తయారీ దారులు అన్ని రకాల సా మాగ్రి కొనుగోలు చేసి..సగానికి పైగా విగ్రహాలు తయారుచేసి..మార్కెట్లోకి తీసుకుని వస్తున్నారు.అంతేకాదు అడ్వా న్స్ బుకింగ్ పూర్తి అవుతుంది.ఈ నినాదంలో కాలుష్యం నియంత్రణ సంస్థ భుజానికి ఎత్తుకోవలసి ఉండగా..వారు మాత్రం దానిని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.నేటి వరకు అసలు విగ్రహాల తయారీ దారుల ను పిలిచి వారికి అవగాహన కల్పించడంతోపాటు ప్రత్యామ్నాయ మార్గాలను చూపే ప్రయత్నం చేయకపోవడం గ మనార్హము.పోటీ తత్వంలో పెరుగుతున్న వాడకం..ఈసారి గణేష్ నవరాత్రులు..చాలా గొప్పగా జరపాలి...పక్క వీధిలో వారి కంటే పెద్దగా ఉండాలి...అంతకంటే ఎ క్కువ ఆకర్షణంగా ఉండాలి...ఎంత ఎక్కువ నగదు ఖర్చు అయినా పర్వాలేదు...ఇలాంటి కారణాలతో అత్యధిక శాతం ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ తో తయారుచేసి అనేక రకాల కృత్రిమ..రంగులను అద్దిన విగ్రహాల వైపు మొగ్గు చూపుతున్నారు.

ఆకర్షణీయంగా ఉంటే దర్శనమిస్తాడని..ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ తో పాటు వివిధ రసాయనాల కలబో తతో రంగురంగులతో తయారు చేసిన వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు..పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం కూడా..ఒక కారణంగా కనిపిస్తుండగా..వారు మార్కెట్లో కొనుగోలు చేసేటప్పుడు కేవలం ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలు అత్యధికంగా కనిపించడం మరో కారణం..అయితే కాలుష్య నియంత్రణ అధికారులు దీనిపై ముందు నుంచే గ్రామీణ నుంచి..పట్టణ స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే..వాటితో ఫలితాలు ఉంటాయని అంటున్నారు పర్యావరణ ప్రేమికుడు.పర్యావరణానికి హాని చేసే రంగులు.. ఆయా విగ్రహాలు తీర్చిదిద్దడానికి వాడే రంగులలో..పాదరసం..సీసం..వంటి లోహ మూలికలు ఉంటాయి.దానితో పాటు ఆమ్లము..ఇతర సేంద్రియ పదార్థాలు ఉంటాయి.ఇవన్నీ నీటిలో కలిసినప్పుడు కాలుష్యాన్ని పెంచుతాయి. పెయింట్ తయారీలో వాడే పదార్థాలు..పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయి.పెయింట్ తయారీలలో ద్రావకం..రం గు కణాలను బట్టి ఉండే జీగురులో కరగని ఘన కణాలు..ఇతర ప్రత్యేక పదార్థాలు వాడతారు.ఈ పదార్థాలు అన్ని పర్యావరణాన్నికాలుష్యం చేస్తూ..ఆరోగ్యానికి హాని కలిగించేవి.రకరకాల క్యాన్సర్లకు కారణం అవుతాయి.విషపూరిత వాయువులు విడుదల..విగ్రహాలకు కృత్రిమ రంగులు వేయడం అనేది పండగ ముందు మనకు కనిపించే ఒక సాధారణ దృశ్యం..ప్లాస్టర్ ఆ ఫ్ ప్యారీస్.. తో చేసిన పెద్ద పెద్ద విగ్రహాలు ఆకర్షణీయంగా కనిపించడం కోసం కళాకారులు..సాధారణంగా బ్రష్ లు ..హెయిర్ స్ప్రే గన్ లను ఉపయోగించి ఈ రంగులు వేస్తుంటారు..గణేష్ విగ్రహాలకు వేసిన పెయింట్లు ఆరే సమయ ములో విడుదలైన సేంద్రీయ వాయువులు గాలిలోని నత్రజని..ఆక్సిజన్లో కలిసి ఓజోన్ అనే వాయువు ఏర్పడుతుం ది.ఇది కొంత మోతాదులో ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది.పెయింట్లలో రంగురంగుల కోసం వాడే ఘన క ణాలలో సాధారణంగా టైటానియం లతో కూడిన పదార్థాలు ఉంటాయి.ఇవి విషపూరితమైనవే..ఆయా వాయువు లు గాలిలో కలవడం వలన వాయు కాలుష్యం జరిగిన..సకాలంలో వర్షాలు పడకపోవడం వంటి పరిణామాలు చో టు చేసుకుంటున్నాయి.ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ తో చేసిన కృత్రిమ రంగులతో అలంకరించిన వినాయక విగ్రహాల వల్ల.. కలిగే దుష్ ఫలితాలు అధికం..వీటిని జలాలలో నిమజ్జనం చేయడం వలన జలచరాలకు ముప్పు ఏర్పడుతుంది.. ప్రజలకు కూడా క్యాన్సర్లు వస్తాయి.




## రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలి

టేకులపల్లి, ప్రభాతవార్త:

టేకులపల్లి నుండి బోడు కోయగూడెం ఓసి కి వెళ్ళు రోడ్డు నిత్యం వందల వాహనాలు బొగ్గు లోడు చేసుకుని లారీలు వెళ్లే రోడ్డు గుంటలు ఏర్పడి ప్రమాదకరంగా మారిందని దీనితో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వెంటనే రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలని ఐ ఎఫ్ టి యు నాయకులు డి ప్రసాద్ ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి భూక్య హర్జ అన్నారు నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు మరమ్మత్తులు చేపట్టడంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం మండల నాయకులు అనంతోజు చంద్రాచారి తునికిపాటి ఆనందు ఉరిమెళ్ళ వెంకటాచారి లింగ జయరాం తదితరులు పాల్గొన్నారు

## ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి.

టేకులపల్లి, ప్రభాతవార్త:

అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర మహాసభలు 8 9 తేదీలలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరగనున్నాయని ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు 9వ మైలు తండా గ్రామపంచాయతీ లోని కోటళ్ల గ్రామంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు గూగులోతు రామచందు భూక్యా హర్జ మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై మహాసభలో చర్చించి తగు ఉద్యమ రూపకల్పన నిర్వహించనున్నట్లు తెలిపారు.కావున ఈ మహాసభలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో కొడెం సమ్మయ్య. ఈసాల నారాయణ ఈసాల నాగయ్య గుగులోతు చంధ్య తదితరులు పాల్గొన్నారు

## కారేపల్లి క్రాస్ రోడ్డు వద్ద వంటావార్పు

కారేపల్లి,సెప్టెంబర్ 3:ప్రభాతవార్త

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన విఫలమైందంటూ బీఆర్ఎస్ (టీఆర్ఎస్)శ్రేణులు తలపెట్టిన భారీ నిరసన శుక్రవారం కారేపల్లి క్రాస్ రోడ్డులో వంట వార్పును ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి ఉన్నం వీరేందర్,మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావులు తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు,రైతు రుణమాఫీ,మహాలక్ష్మి పథకం,నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారుజ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుండి బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి వంటవార్పును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ముత్యాల వెంకట అప్పారావు,నాయకులు తాత వెంకటేశ్వర్లు,సిద్ధంశెట్టి నాగయ్య,శివరాత్రి అచ్చయ్య,బానోతు రాందాస్, వెగ్గలం రాజు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా తమ్మిశెట్టి

కారేపల్లి, సెప్టెంబర్ 3: ప్రభాతవార్త

ప్రభుత్వ జూనియర్ కళాశాల చరిత్ర అధ్యాపకుడు తమ్మిశెట్టి శ్రీనివాస్ రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా గుర్తింపు పొందడం పట్ల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు ఇంటర్మీడియట్ బోర్డు రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా సిఫార్సు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆయన సేవలను గుర్తించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్. విజయ కుమారి తెలిపారు.చరిత్ర అధ్యాపకుడిగా విద్యార్థులకు మెరుగైన బోధన అందించడంతో పాటు, విద్యారంగంలో పలు కీలక బాధ్యతలను శ్రీనివాస్ సమర్థవంతంగా నిర్వహించారు. టెక్స్ట్బుక్ రైటర్గా, మాస్టర్ ట్రైనర్గా, డిజిటల్ కంటెంట్ రూపకల్పనలో ఆయన విశేషంగా సేవలందించారు. ప్రతి సంవత్సరం చరిత్ర సబ్జెక్టులో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన అందించడం ప్రత్యేకతగా నిలిచింది. తన బోధన ద్వారా కొన్ని వందల మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించేలా మార్గనిర్దేశం చేసిన ఘనత శ్రీనివాస్కు దక్కింది. విద్యార్థులను కేవలం పరీక్షలకు సిద్ధం చేయడమే కాకుండా, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు.2009లో స్కూల్ అసిస్టెంట్గా జిల్లా స్థాయిలో టాప్ ర్యాంక్, అనంతరం 2012లో చరిత్ర సబ్జెక్టులో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించి తన ప్రతిభను చాటుకున్నారు.

# రామవరం ప్రాంత వాసులకు పొజీషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలి

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆర్డిఓ కార్యాలయం ఎదుట ధర్నా

**కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**

కాంగ్రెస్ సర్కార్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. 22ఏ ద్వారా నిషేధిత జాబితాలో పెట్టిన ప్రైవేట్ భూములను అందులో నుంచి విడుదల చేయాలని, రామవరం ప్రాంత వాసులకు పొజీషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనా వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు పిలుపు మేరకు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావుల సూచనల మేరకు ఈ ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో వందలాదిగా పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు గులాబీ కండువాలు ధరించి, జెండాలు, ప్లకార్డులు చేతబట్టి రేవంత్ రెడ్డి



అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద పెట్టున నినాదాలిచ్చారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు హయాంలో 76 జీవో ప్రకారం కొత్తగూడెం మునిసిపాలిటీలో 10వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని మాజీ మున్సిపల్ చైర్మెన్ సీతామహాలక్ష్మీ ృ, మాజీ వైస్ చైర్మెన్ వేల్పుల దామోదర్ తెలిపారు. ఆ జీవో ప్రకారం సిద్ధంగా ఉన్న 4వేల పట్టాలను వెంటనే పేదలకు పంపిణీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అదేవిధంగా రామవరం ప్రాంత వాసులు ఇండ్లు కొనుక్కోలేక, అవసరాలకు అమ్ముకునే వీలులేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే పొజీషన్ సర్టిఫికెట్లు జారీ చేయాల్సిందిగా ఆర్డీవోకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. "అబద్ధపు హామీలతో అధికారం1000 రోజులుగా కాంగ్రెస్ మోసం","అమలు కాలేదు ఒక్క గ్యారంటీహస్తం పతనానికి మాది గ్యారంటీ","ఆరు గ్యారంటీ లు ఎగ్గొట్టిన రేవంత్‌నిన్ను ఇంటికి పంపడం మా వంతు"అని రాసిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలిచ్చారు. ఈ ఆందోళన కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ కార్పోరేటర్ సాగర్ మల్హోత్రా, మాజీ కౌన్సిలర్లు బండారు రుక్మాంగధర్, అంబుల వేణుగోపాల్, నాయకులు ముద్దంగుల మహేష్, ఏమునరి శివ కృష్ణ, జూనూరి రాజేష్, ఖాజాభక్ష్, మాదాసు పద్మ, ధీకొండ సునీత, మనోజ్, జానీ, కాళీ, సచిన్, అమర్, సిద్ధూ, సుందర్, సురేందర్, చంద్రయ్య, సుధీర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లగడపాటి రమేశ్ చంద్ జన్మదిన వేడుకలు

**లక్ష్మీ ృదేవిపల్లి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**



లగడపాటి రమేష్ చంద్ జన్మదిన సందర్భంగా శ్రీనగర్ పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి నూతన వస్త్రాల పంపిణీ, సుమారు 1000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, సర్పంచ్ బానోతు. రాణి, ఉప సర్పంచ్ కేశవరావు, సిపిఐ మండల సెక్రెటరీ డిటి లక్ష్మీ ృపతి, ఉర్దూగర్ మాజీ చైర్మన్ అన్వర్ భాష, ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగరాజు, సింగరేణి డివైజియం కలవల చంద్రశేఖర రావు, రామచంద్ర కళాశాల విశ్రాంత ఆచార్యులు ప్రసన్నకుమార్ తదితరులు మాట్లాడుతూ... సామాజిక సేవా కార్యక్రమాల్లో లగడపాటి ముందుంటాడని నేటి యువతకు లగడపాటి ఆదర్శమని ముఖ్యంగా కరోనా కష్ట సమయంలో ఎంతో మందిని ఆదుకున్నాడని, ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకొని మౌలిక సౌకర్యాలు కల్పించి అభివృద్ధి దిశగా నడిపించారని పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం నూతన వస్త్రాలను అందించడం అభినందనీయమని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను పంపిణీ చేయడం మంచి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యుత్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలి: వై.వి. శేఖర్‌బాబు

**కొత్తగూడెం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**

సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌ను జనరల్ మేనేజర్ (డబ్ల్యూఎస్ !! ఈఎం) వై.వి. శేఖర్‌బాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్విచ్‌యార్డ్, కంట్రోల్ రూమ్‌లను పరిశీలించి విద్యుత్ భద్రతపై అధికారులకు పలు సూచనలు చేశారు. అత్యంత అధిక వోల్టేజ్ విద్యుత్ పరిసరాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని, భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హై వోల్టేజ్ పరికరాల నిర్వహణ, స్విచ్‌యార్డ్‌లో పనుల సమయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అందుబాటులో ఉన్న భద్రతా వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించి ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జీఎం (ఈ!!ఎం), సెంట్రల్ వర్క్‌షాప్ కె. రామమోహన్, డీజీఎం (ఈ!!ఎం) 132 కేవీ సబ్‌స్టేషన్ కె. వేలాద్రి, డీవైఎస్‌ఈ ఫరూక్ అహ్మద్, జేఈ (ఈ!!ఎం) కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# సెయింట్ జోసెఫ్ హై స్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**రుద్రంపూర్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**

చుంచుపల్లి మండలం ధన్‌బాద్ గ్రామపంచాయతీ పరిధిలోని సెయింట్ జోసెఫ్ హై స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్కేజీ, యూకేజీ విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణ పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. అనంతరం విద్యార్థులు శ్రీకృష్ణుడి జీవితంలోని ముఖ్య




ఘట్టాలను వివరిస్తూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు, పాటలు, వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... శ్రీకృష్ణుడి జీవితం విద్యార్థులకు ఎన్నో మంచి విషయాలను నేర్పుతుందని తెలిపారు. ముఖ్యంగా నిజాయితీ, ధైర్యం, మంచి ఆలోచనలు, క్రమశిక్షణ వంటి విలువలను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాలలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. బ్రదర్ జయ బాలన్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## వెస్ట్ జోన్ ప్రీఆర్‌డీ పరేడ్ క్యాంప్‌నకు ఎనఎసఎస్ వాలంటీర్ల ఎంపిక

**అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**



అశ్యారావుపేట వ్యవసాయ కళాశాలకు చెందిన ఇద్దరు ఎనఎసఎస్ (ఎనఎసఎస్) వాలంటీర్లు ప్రతిష్టాత్మక వెస్ట్ జోన్ ప్రీఆర్‌డీ పరేడ్ క్యాంప్ 2026కు విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికయ్యారు. ఈ క్యాంప్ ఈనెల 7న హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించబడుతుంది. ఎంపికైన విద్యార్థుల్లో ఎం. మోహన్ బాబు, ఎ శశి కీర్తన ఉన్నారు. కాగా కళాశాల నుండి జాతీయ స్థాయికి ఎంపికైన ఇద్దరు వాలంటీర్లను అసోసియేట్ డీన్ హేమంత్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, కష్టపడే తత్వంతో విద్యార్థులు ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమన్నారు. రాబోయే ప్రీఆర్‌డీ పరేడ్ క్యాంప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, విశ్వవిద్యాలయానికి మరియు కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో ఎనఎసఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## శిరీష కు న్యాయం చేయాలి రోడ్డుపై బిజెపి గిరిజన మోర్చా నిరసన

**దమ్మపేట రూరల్ సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :**



ఊకే శిరీష కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని ఆమె కుటుంబానికి కోటి రూపాయలు తక్షణ సహాయం అందించాలని బిజెపి మోర్చా ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రహదారిపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తంబళ్ల రవి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఒక ఆదివాసి బిడ్డ అయినా గాని బాధిత కుటుంబానికి పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయారని విమర్శించారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ గిరిజనులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించే తీరిక మంత్రులకు లేదని, బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షి ంచాలని బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ బిజెపి పోరాడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ధారా నాగేశ్వరరావు, కొలకపోగు ముసలయ్య, కొరస వీరభద్రం, గూడ ముత్యాలరావు, పూచి ప్రసాద్, పుల్లారావు, సత్యనారాయణ, కారం రత్తకుమారి, తంబళ్ల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నేడు బిఆర్ఎస్ వంట వార్పు

**దమ్మపేట రూరల్ సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :**



కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనపై, 420 మోసాలపై బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నేడు మండల కేంద్రంలో రహదారిపై వంటా,వార్పు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు దొడ్డ రమేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ 1000 రోజుల పాలనకు ఘనంగా వేడుకలు

**వైరా టౌన్ సెప్టెంబర్ 03 (ప్రభాతవార్త)**

కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వీరంశెట్టి సీతారాములు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి, విద్య, వైద్యం, గృహ నిర్మాణం వంటి రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభయహస్తం హామీలను ఆచరణలోకి తీసుకువస్తున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్,



200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. వైరా నియోజకవర్గ అభివృద్ధికి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, వైరా పట్టణంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయడం ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి 1000 రోజుల సందర్భంగా వైరా పట్టణ కాంగ్రెస్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, మార్క్ ఫెడ్ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, డాక్టర్ కాప మురళీకృష్ణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కట్ల సంతోష్, ఆత్మ కమిటీ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి దొడ్డ పుల్లయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బిడికే రత్నం, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పనితి శీను, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాలేటి నరసింహారావు, పల్లపు కొండలు వేముల రత్నాకర్, చెరుకూరి కిరణ్, ఖమ్మం మీరా, మిట్టపల్లి శ్రీను సయ్యద్ అన్వర్, నారపోగు రవి, చింతనిప్పు ప్రసాద్, తోటకూర శ్రీకాంత్, వాకుడోత్ బిక్యా, ఏదునూరు శ్రీను, పువ్వాళ్ళ రాము, దురిశెట్టి నరసరావు, బుడిగి వెంకన్న తోటకూర వీరబాబు, మండలం నుంచి వచ్చిన సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.




## బ్రిలియంట్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు





**కారేపల్లి సెప్టెంబర్ 3 ప్రభాతవార్త**

భారతీయ సంస్కృతికి ప్రతీక కృష్ణాష్టమి వేడుకలని మనలో నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చే ఎన్నో సంఘటనలు నేటి సమాజానికి మార్గదర్శకం చూపెడుతుందని బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ మల్లెల నాగేశ్వరరావు అన్నారు. బ్రిలియంట్ స్కూల్‌లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు తదితర వేషధారణలతో సందడి చేశారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, నృత్య ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకల్లో భాగంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కూడా ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి బాల్య లీలలు, కృష్ణాష్టమి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ మల్లెల నాగేశ్వరరావు మాట్లాడుతూ, శీకృష్ణుడి జీవితం పిల్లలకు అనేక మంచి సందేశాలను అందిస్తుందని, చిన్నారులు శ్రీకృష్ణుడి సత్యం, ధర్మం, ధైర్యం, మంచి పనులు చేయాలనే గుణాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజిమోన్, షైనీ, ఇందిర, జ్యోతి, సరోజ, ముంతాజ్, మోనిక, దివ్య, హఫీసా పాల్గొన్నారు.

# గోపికల వేషంలో చిన్నారుల సందడి

**.శ్రీకృష్ణుడి లీలలు..గోపికల కోలాహలు..**

**ఏన్కూరు, సెప్టెంబర్ 03, ప్రభాతవార్త**

:హిందూ పురాణాల ప్రకారం..శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగను శ్రీ విష్ణుమూర్తి ఎనిమిదో అవతారం శ్రీకృష్ణుడి జన్మదినం. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఏన్కూరులోని ఉషోదయ స్కూల్‌లో ముందస్తుగా జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణుడు..గోపికల వేషంలో చిన్నారులు జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు గోపికల వేషధారణలో సంప్రదాయ దుస్తులు.. ఆభరణాలతో ముస్తాబై ఆకట్టుకున్నారు.విద్యార్థులు చిన్ని కృష్ణుడు..గోపికల వేషధారణ వేసి అల్లరి చేష్టలు ఎంతగానో అలరించారు.చిన్నారుల వేషధారణ తో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది .శ్రీకృష్ణుడు లీలలు..గోపికల వేషధారణ ద్వారా విద్యార్థులలో మన సం స్కృతి..సంప్రదా యాలపై ఆసక్తిని పెంపొందించేందుకే ఈ కార్య క్రమాన్ని



నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్నారులను గోపిక..ఈ కృష్ణుడు వేషధారణలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కళ్లకు కట్టినట్లుగా నిర్వహించారు.విద్యా ర్థులు ప్రదర్శించిన సంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. చిన్నారులతో ఇటువంటి కార్యక్రమాలు చేయించడం ద్వారా..వారిలో మతసామరస్యాన్ని పెంపొం దింప వ చ్చునని ఆయన అన్నారు.శ్రీకృష్ణుడి జీవితం.. బోధనలు..లీలలను విద్యార్థులు తెలుసుకోవడంతో పాటు భారతీ య సంస్కృతి..సంప్రదాయాలపై అవగాహన







పెంపొందించు కోవాలని అన్నారు.పండుగల విశిష్టతను చిన్నా రులకు తెలియజే యడంతో పాటు వారిలో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయని పేర్కొన్నారు.అనంతరం చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కర స్పొండెంట్ కడియాల సత్యనారాయణ, ఏవో నరసింహారావు, ఉపాధ్యాయులు,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నా రు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి వెయ్యి రోజుల సంబరాలు



**ఏన్కూరు,సెప్టెంబర్ 03, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఏన్కూ రులో కాంగ్రెస్ సంబరాలు ఘనంగా నిర్వహించింది. కాంగ్రెస్ నాయకులు..కార్యకర్తలకు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మాజీ మండ ల అధ్యక్షుడు స్వర్ణ నరేందర్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందని అన్నారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ లను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు.ప్రజలకు మరింత మె రుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చే స్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు.రైతులు.. మహిళలు..పేదలు.. యువత.. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలతో ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు .పేద కు టుంబాలకు అండగా నిలిచి..ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను సహకారం చేయడమే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యం అ ని ఆయన పేర్కొన్నారు.పేదవాడి కలను నెరవేర్చే ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి ఆనందా న్ని పంచుకున్నారు.అనంతరం నాయకు లు.. కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమం లో గుగ్గులోతు లచ్చిరాం నాయక్, మేడా ధర్మారావు,భూక్యా లాలూ నాయక్,చందమామ నరసింహారావు,ధనసరి నవీన్,అజ్మీర్ సురేష్,బానోతు లక్ష్మ,వాసిరెడ్డి సత్యనారాయణ,పఠాన్ మజీద్ ఖాన్,శివ శం కర్ వరప్రసాద్, కనిశెట్టి వెంకన్న,దిద్దుకూరి భాస్కరరావు,గుర్రం రవి,బందెల ప్రకాష్, షేక్ నన్నే ఖాన్, మాచర్ల శ్రీను, దామర్ల వీరయ్య,దామర్ల కరుణ,బాలాజీ, వీరభద్రం,వీరబ్రహ్మం,తిరుపతయ్య,ఉపేందర్ రావు,రామకోటి,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సహకారంతో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు

**కారేపల్లి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త**

ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో మండలంలో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని ప్రజా పాలన ప్రభుత్వ లక్ష్యం అభివృద్ధి ప్రధాన ఎజెండా అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బానోతు రామ్మూర్తి నాయక్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు అడ్డగోడ ఐలయ్య సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు లు అన్నారు. ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలన విశేషాలపై మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలనలో ప్రజలకు చేరువగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పెద్ద ఎత్తున అమలు చేస్తోందని అన్నారు. మండలంలో రూ.3.50 కోట్ల రూపాయలతో పేరుపల్లి బుగ్గ వాగు బ్రిడ్జి నిర్మాణానికి నిధులను మంజూరు చేయడం హర్షనీయమని, అలాగే కోట్ల రూపాయలతో మండలంలో సిసి రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధిక



ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు గుడిసె లేని గ్రామాన్ని చూడాలనేదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని అన్నారు. పేదలు, రైతులు, అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని అన్నారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థికంగా స్వావలంబన సాధించేలా స్వయం సహాయక సంఘాలకు రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, ఉచిత విద్యుత్, సన్నవడ్లకు బోనస్ వంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయ రంగానికి ప్రభుత్వం చేయూతనిచ్చిందని పంటలకు గిట్టుబాటు ధర, ధాన్యం కొనుగోళ్లను మరింత పటిష్ఠం చేయడంపై దృష్టి సారించిందనీ చెప్పారు.ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతో పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించి యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాల్లో శిక్షణ అందించే కార్యక్రమాలను కొనసాగిస్తోందని అన్నారు.చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కారేపల్లి టౌన్ కమిటీ అధ్యక్షుడు ఓలగాని శ్రీనివాసరావు, వాణిజ్య విభాగం నాయకులు సురేందర్ మనియార్, ఆంగోత్ మత్రునాయక్, ఆదర్ల రాములు, అనీఫ్, యాకూబ్ అలీ, తాజుద్దీన్, షేర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి, పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలి

నేలకొండపల్లి సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:



గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ ఆసుపత్రి, పాఠశాలల్లో మౌలిక వసతులను ప్రభుత్వం వెంటనే కల్పించాలని నేలకొండపల్లి మండల సిపిఎం కార్యదర్శి కే.వి రామిరెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు డిమాండ్ చేశారు. గురువారం బోదులబండ గ్రామం లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ పాఠశాల, మండల పరిషత్ పాఠశాలలను సీపీఎం పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో సర్వే కమిటీ సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా ఆసుపత్రి, పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలను వారు గుర్తించి, వాటి వివరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత ప్రధాన సమస్యగా ఉందని సర్వేలో గుర్తించినట్లు వారు చెప్పారు. వైద్య సిబ్బంది కొరత కారణంగా రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెప్పారు. ఆసుపత్రి ఫార్మసీలో అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులు బయట నుంచి మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు తెలిపారు. ఆసుపత్రిలో నెలకొన్న అనేక సమస్యలను సర్వే కమిటీ గుర్తించింది. అలాగే, ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల ఆవరణలను కూడా సర్వే కమిటీ పరిశీలించింది. పాఠశాలల పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు, భారీగా పెరిగిన చెట్లు ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు గుర్తించారు. పాఠశాల వాష్‌రూమ్‌ల పరిసరాల్లో పరిశుభ్రత లోపించడం వల్ల విద్యార్థులకు అసౌకర్యం కలుగుతోందని వారు పేర్కొన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. అనంతరం సర్వే కమిటీ ఆధ్వర్యంలో బోదులబండ గ్రామ పంచాయతీ కార్యదర్శికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పెద్దపాక మల్లేశ్వరరావు, సిపిఎం పార్టీ బోదులబండ గ్రామ శాఖ సభ్యులు చింతలపాటి భాస్కర్, అనంత యల్లయ్య, ఆలకుంట్ల సీతారాములు, గోపి , కట్టెకోల చిన్నికృష్ణ, మరికంటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




## మండల టీజేఎస్ అధ్యక్షుడుగా మండడి

నేలకొండపల్లి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:



తెలంగాణ జన సమితి (టీజేఎస్ ) నేలకొండపల్లి మండల కమిటీ అధ్యక్షుడుగా మండడి వెంకటేశ్వర్లు ఎన్నికైనారు. గురువారం తెలంగాణ జనసమితి నేలకొండపల్లి మండల సమావేశం కొత్త కొత్తూరు గ్రామం నందు జరిగింది. ఈ సమావేశంలో నేలకొండపల్లి మండల టీజేఎస్ నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ ఉపాధ్యక్షులుగా యర్ర వెంకటేశ్వర్లు, కార్లపాటి కోటయ్య, ప్రధాన కార్యదర్శిగా బస్వాపురం నాగేశ్వరావు, కార్యదర్శులుగా గుగులోత్ ఆంజనేయులు, చిట్టూరి వెంకయ్య, కోశాధికారిగా రెడ్డిబత్తుల సాంబిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా గుగులోత్ నాగేశ్వరావు, వడ్లమూడి వెంకటరాములు, బానోత్ మోహనరావు, గార్లపాటి సత్యనారాయణ, ధరమళ్ళ ధనమూర్తి, అల్లిక రంగయ్య లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం లో టీజేఎస్ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి, పార్టీ జిల్లా ఇంచార్జి గోపగాని శంకరరావు, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు మాదాసు శ్రీనివాసరావు, జిల్లా నాయకులు కాకుమాని మల్లికార్జునరావు, తీగ రాములు, మేకల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

## గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసిన మంత్రి

కూసుమంచి, సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త ) :



గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మంత్రి, కూసుమంచి మండలం కేశవాపురం గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత రెండున్నర ఏళ్లలో కేశవాపురం గ్రామానికి రూ. 4 కోట్ల నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులు చేశామన్నారు. ఇందులో రూ. 40 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, రూ. 3.30 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు ఎలక్ట్రికల్ లైన్లు, అంగన్వాడీ కేంద్రం, మంచినీటి సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేశామన్నారు. పేద మహిళలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తున్నామన్నారు. నిరుపేదల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. మూడో విడత, నాల్గో విడత ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి అన్నారు. రైతును రాజు చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత రెండున్నర ఏళ్లలో రైతు రుణమాఫీ, రైతు భరోసాతో కలిపి మొత్తం రూ. 1,76,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. నిరుద్యోగ యువతకు భరోసానిస్తూ ఇప్పటివరకు 72,000 ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. మరో 11,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ పథకం కింద రూ. 67,000 కోట్లు విడుదల చేశామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అక్కడక్కడా ఉన్న యూరియా కొరత సమస్యను ఒకటి రెండు రోజుల్లో పూర్తిగా పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసివో గంగాధర్, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, పిఆర్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, డీపీవో వినోద్ కుమార్, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కూసుమంచి మండల తహశీల్దార్ సైదులు, కేశవాపురం గ్రామ సర్పంచ్ బానోతు మమత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అల్ ఇండియ బ్రాహ్మణ ఫ్రంట్ జాతీయ కోర్ కమిటీ సభ్యుడుగా ఇంగువ రామకృష్ణ

నేలకొండపల్లి సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:



ఆల్ ఇండియ బ్రాహ్మణ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఇంగవ రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి శ్రీపతి పండితారాధ్యుల సతీష్ చంద్ర లు అల్ ఇండియ బ్రాహ్మణ ఫ్రంట్ జాతీయ జాతీయ కోర్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఇటీవల ఉత్తరాఖండ్ రాష్ట్రం లోని హరిద్వార్ నందు రెండు రోజులపాటు ఆల్ ఇండియ బ్రాహ్మణ ఫ్రంట్ జాతీయ కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అల్ ఇండియ బ్రాహ్మణ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులుగా మహంతి స్వరూప్ బీహారి, ప్రధాన కార్యదర్శిగా పి.వీ. సాయినాథ్, కోశాధికారిగా లావణ్య చరణ్ లను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అల్ ఇండియ బ్రాహ్మణ ఫ్రంట్ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు ఇంగువ రామకృష్ణ తెలిపారు. ఈ సమావేశముకు వివిధ రాష్ట్రాల అధ్యక్ష, కార్యదర్శులు, వివిధ శాఖల సభ్యులు, అన్ని రాష్ట్రాల సభ్యులు పాల్గొన్నట్లు ఆయన చెప్పారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు






నేలకొండపల్లి సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని గురువారం నేలకొండపల్లి లోని గౌతమ్ స్కూల్ నందు శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ అలరించారు. అనంతరం, పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే (ఉట్లోత్సవం) కార్యక్రమంలో విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ కనపర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు చిన్ననాటి నుంచే తెలియజేసేందుకే ఇలాంటి వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ స్కూల్ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ చక్రధర్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల శ్రీ కృష్ణుని జన్మదిన వేడుకలు

వైరా టౌన్ సెప్టెంబర్ 3 (ప్రభాతవార్త)





వైరా మున్సిపాలిటీ పరిధిలోని న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల యందు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ డా పి.భూమేష్ రావు మాట్లాడుతూ, శ్రీ మహావిష్ణువు యొక్క 8వ అవతారమే శ్రీ కృష్ణుడని, శ్రీకృష్ణుని యొక్క జన్మదినము రోజున శ్రీ కృష్ణాష్టమి పండుగను నిర్వహించుకుంటున్నామని మాట్లాడుతూ దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ. అన్న గీతోపదేశంతో మానవాళికి దిశ, నిర్దేశం చేశారని, మహాభారత యుద్ధాన్ని ముందుండి నడిపించిన మార్గదర్శి అని, ద్వాపర యుగంలో జన్మించిన శ్రీకృష్ణుడు నేటి కలియుగానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఇటువంటి పండుగలను నిర్వహించకోవడం భావి తరాల వారికి మన సంస్కృతి సాంప్రదాయాలను అందించడంలో న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల ముందుంటున్నది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డా పి.భూమేష్ రావు, ప్రిన్సిపాల్ షాజీ మ్యాథ్యూ, ఎ.ఓ. నరసింహ రావు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## యూరియా ఇస్తారా, వ్యవసాయం వదిలేయమంటారా..!

నేలకొండపల్లి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :

రైతులకు సరిపడా యూరియాను అందించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతు సంఘం పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు ఎడ్ల తిరపతిరావు తీవ్రంగా ధ్వజమెత్తారు. గురువారం నేలకొండపల్లి నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎడ్ల తిరపతిరావు మాట్లాడుతూ యూరియా ఇవ్వలేకుంటే ప్రభుత్వం చెప్పాలని, లేకుంటే వ్యవసాయంను వదిలియమంటారా అని ఆయన ప్రశ్నించారు. తాను 25 ఎకరాలు సాగు చేస్తున్నానని, యూరియా లేక పొలం దెబ్బ తింటుందన్నారు. యాప్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. యాప్ లో క్షణాలలోనే అయిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతిక కారణాలతో యాప్ బుక్ కావటం లేదన్నారు. యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని ఆయన హెచ్చరించారు. యూరియా సరఫరా లో ఇలాంటి నిర్లక్ష్యం చేస్తే పంటలు పూర్తిగా దెబ్బతింటాయన్నారు. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. యాప్ తో కాకుండా రైతులకు ప్రత్యామ్నాయంగా యూరియా ను అందించే ఏర్పాట్లు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# వెయ్యోంతుల..జోష్..!!

**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలనకు వెయ్యి రోజుల పూర్తి**

**కూసుమంచిలో 1,000 బైకులతో భారీ ర్యాలీ**

**ఓపెన్ టాప్ జీప్ లో ముందుకు సాగి..మరింత ఉత్సాహం నింపిన రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి**

**బీఆర్ఎస్ తీరుపై భగ్గు..**

**అసలు దొరే ఫాం హౌస్ కు పరిమితమయ్యాడు..**

**పిల్ల కాకులు కారు కూతలు మానుకోవాలని ఎద్దేవా**

**పాలేరులో మళ్లీ గెలిచేది.. నిలిచేది కాంగ్రెస్సేనన్న మంత్రి శ్రీనివాసరెడ్డి**



**కూసుమంచి, సెప్టెంబర్ 3(ప్రభాతవార్త ) :**
సంక్షేమపథకాలు అందించుటలో వెయ్యోంతుల జోష్‌తో ముందుకు వెళదామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగలిటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో 1,000 బైకులతో నాయకన్ గూడెం నుంచి కూసుమంచి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఓపెన్ టాప్ జీపులో ముందుకు సాగుతూ.. పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా కూసుమంచి ప్రధాన సెంటర్లో కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు.

### 3,475 రోజుల మీ పాలనలో చేసిందేమీ లేదు..

గతంలో రాష్ట్రాన్ని పరిపాలించిన పాలకులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నింటినీ సమన్వయం చేసుకుంటూ సంక్షేమ పరిపాలన కొనసాగిస్తుంటే పిల్ల కాకులు కారు కూతలు మానుకోవాలంటూ హెచ్చరించారు. ప్రజలు బీఆర్ఎస్ దొరను ఫామ్ హౌస్ కే పరిమితం చేశారనే అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజాపాలనపై బీఆర్ ఎస్ నేతలు విషం చిమ్మె ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 3,475 రోజుల వారి పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. పేదలకు ఇందిరమ్మ ఇళ్లిచ్చామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిపికేషన్లు ఇలా ఎన్నో చేసామని వివరించారు. నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా...తమ పాలనలో చూపామని అన్నారు.అసలు పెద్ద దొరనే ఫామ్ హౌస్ కు పరిమితం అయ్యాడని, పిల్ల కాకులు కారు కూతలు మానుకోవాలని హితవు పలికారు...

### అభివృద్ధి, సంక్షేమాన్ని పేదల గడపకు చేర్చాం..

ప్రజల దీవెనలతో తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చి.. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం పేదల ఇంటి గడపలకు చేర్చి వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరక్ష్యంల్ల చేసిన రంగాలను ఒక్కొక్కటిగా సరిదిదుతున్నామని, రైతులు, మహిళలు, నిరుద్యోగులు, దళిత, బీసీ, మైనారిటీలకు ప్రభుత్వ లబ్ధి కలిగేలా కృషి చేస్తున్నామని చెప్పారు.

### పాలేరులో మళ్ళీ గెలిచేది..నిలిచేది కాంగ్రెస్సే..

పాలేరు నియోజకవర్గానికి.. రూ.కోట్లాది నిధులతో ఎంతో చేశామని, భవిష్యత్ లో ఇంకెంతో చేస్తానని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో పాలేరు రిజర్వాయర్ ను తీవ్ర నిరక్ష్యల్ల చేశారని, ఇక్కడి రైతులను విస్మరించి మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు నీటిని తరలించారని.. ఇప్పుడు గుడ్డు వచ్చి పిల్లని వెక్కిరించినట్లుగా.. మాట్లాడడానికి సిగ్గుండాలని తీవ్రంగా హెచ్చరించారు. పాలేరు అంటేనే కాంగ్రెస్ అని, పాలేరు నియోజకవర్గం అంటే తనకు సొంతిల్లు అని, ఎవరెన్ని పొర్లుదండాలు పెట్టినా.. మళ్ళీ ఇక్కడ గెలిచేది, నిలిచేది ముమ్మాటికీ కాంగ్రెస్సే అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో.. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బజ్జురి వెంకటరెడ్డి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి హఫీజ్ ఉద్దీన్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, జూకూరి గోపాలరావు, కూసుమంచి సర్పంచ్ కొండా కృష్ణవేణి, పాలేరు సర్పంచ్ బానోత్ నాగేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, కాం గ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మహిళలు, చిన్నారుల భద్రతకు మరింత పటిష్ట చర్యలు

**జిల్లా మహిళా భద్రతా విభాగం ఏర్పాటు**

**: ఎస్పీ రోహిత్ రాజు**

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త**
తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా మహిళా భద్రతా విభాగంను నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టడం, బాధితులకు తక్షణ సహాయం అందించడం, కేసుల దర్యాప్తు మరియు పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్, పునరావాసం తదితర కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించడం జిల్లా మహిళా భద్రతా విభాగం ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లా మహిళా భద్రతా విభాగం సభ్యులతో సమావేశమై వారి విధులు, బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. మహిళలు, బాలికలు మరియు చిన్నారుల భద్రతకు సంబంధించిన అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, బాధితులకు అండగా నిలవాలని సూచించారు.జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న మహిళా భద్రతా బృందాలు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, మహిళా పోలీస్ స్టేషన్, కౌన్సెలింగ్ కేంద్రాలు తదితర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ మహిళలు, చిన్నారుల భద్రతకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణతో పాటు, నమోదైన కేసుల దర్యాప్తు మరియు పర్యవేక్షణలో నాణ్యతను పెంచాలని, బాధితులకు అవసరమైన చట్టపరమైన సహాయం, కౌన్సెలింగ్, ఇతర సహాయ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ ఇ.శ్రీనివాస్, ఎస్సై శ్రీనివాస్, ఏఎస్ఐ కస్తూరి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్పత్తి కన్నా ఉద్యోగుల భద్రతే ప్రధానం

**ప్రమాద రహిత సింగరేణి కోసం అన్ని రకాల చర్యలు**

**రక్షణ పెంపుదలకు ఆధునిక సాంకేతికత వినియోగం**

**50వ త్రైపాక్షిక భద్రత సమీక్షా సమావేశంలో సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి**



**కొత్తగూడెం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**
సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి కన్నా ఉద్యోగుల భద్రతకే అధిక ప్రాధాన్యత ఇస్తామని, ప్రమాదరహిత సింగరేణి కోసం తగు చర్యలు తీసుకుంటామని, కార్మిక సంఘాల వారు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకుంటామని సింగరేణి ఛైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన 50వ త్రైపాక్షిక భద్రత సమీక్షా సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సమావేశంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు, సింగరేణి అధికారుల సంఘం, గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్య ప్రతినిధులు సింగరేణి గనుల్లో రక్షణ చర్యల పైన సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ... ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏ విధంగా అమలు అవుతున్నాయి, జరిగిన పొరపాట్లు మళ్లీ జరుగుతున్నాయా? ప్రమాద రహిత మైనింగ్ కొరకు అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీ ఏమిటి? అనే అంశాల పైన పరిశీలించి తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు వెల్లడించిన సూచనలపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ డాక్టర్ సగేష్ కుమార్ మాట్లాడుతూ సమావేశంలో కార్మిక సంఘాలు ఎన్నో విలువైన సూచనలు చేశారని, రక్షణ పై సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలు నిబద్ధతతో పనిచేయడం సంతోషకరమన్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది ప్రాణాపాయ ప్రమాదాల సంఖ్య బాగా తగ్గటం అభినందనీయమన్నారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో సింగరేణి ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు కూడా ఒకే చోట బయోమెట్రిక్ విధానంలో హాజరును నమోదు చేసే పద్ధతిని వెంటనే అమలు చేయాలని సూచించారు. సింగరేణి ఉద్యోగుల రక్షణ పెంపుదలలో తగిన శిక్షణ ఇవ్వడానికి తాము ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ గుర్తింపు కార్మిక సంఘం యూనియన్ అధ్యక్షుడు శ్రీ వాసిరెడ్డి సీతారామయ్య, కార్యదర్శి శ్రీ రాజ్ కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ శ్రీ జనక్ ప్రసాద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ ఎస్ నరసింహా రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీ తాళ్లపల్లి లక్ష్మపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీ పెద్ది నరసింహులు పాల్గొన్నారు, వీరితో పాటు వివిధ ఏరియాల నుంచి హాజరైన ప్రతినిధులు సింగరేణి వ్యాప్తంగా రక్షణ పెంపుదలకు, ఆరోగ్య వైద్య సేవలు పెంపుదలకు పలు సూచనలు చేశారు. తమ గనుల్లో గల పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సిబ్బంది కొరతను తగ్గించాలని, ఆధునిక వైద్య సేవలు అందించాలని, కాంట్రాక్టు కార్మికులకు కూడా తగిన శిక్షణ ఇప్పించాలని, నాణ్యమైన బూట్లు సరఫరా చేయాలని, గనుల్లో అవసరమైన సూపర్ వైజర్లు, సిబ్బంది మరియు అధికారులను నియమించాలని, స్పేర్ పార్ట్ లు అందుబాటులో ఉంచాలని సూచించారు. దీనిపై యాజమాన్యం తరఫున తగు చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హామీ ప్రకటించారు. ఈ సమావేశానికి జనరల్ మేనేజర్ (సేఫ్టీ) శ్రీ సాయిబాబు స్వాగతం పలికారు. ముందుగా ఇటీవలి ప్రమాదాలలో మృతి చెందిన కార్మికులకు సమావేశం సంతాపం తెలిపింది. అనంతరం గత ఏడాది త్రైపాక్షిక సమావేశంలో తీసుకున్న నిర్ణయాల పైన చర్చించారు. సుహృద్భావ వాతావరణంలో సమావేశం కొనసాగింది. ఈ సమావేశంలో సంస్థ ఛైర్మన్ తో పాటు డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్ మరియు ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎమ్. తిరుమల రావు, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, కార్పోరేట్ జనరల్ మేనేజర్లు మరియు డీజీఎంఎస్ నుంచి డైరెక్టర్స్ ఆఫ్ మైన్ సేఫ్టీ డాక్టర్ సగేష్ కుమార్, డాక్టర్ ఐ. సత్యనారా యణ, రాజ్ కుమార్, కె మహేశ్వరరెడ్డి, పంకజ్ కుమార్ జైన్, డిప్యూటీ డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జేబీసీసీఐ ఏర్పాటుకు బీఎంఎస్ కీలక ముందడుగు

**ఐఆర్ కోడ్ సెక్షన్ 14 నుంచి మినహాయింపు**

**ఇవ్వాలని కేంద్రానికి లేఖ**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త**
బొగ్గు పరిశ్రమలో జాయింట్ బైపార్టైట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ (జేబీసీసీఐ) ఏర్పాటుకు మార్గం సుగమం చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) డిమాండ్ చేసింది. గురువారం కోల్‌కతాలో జరిగిన కోల్ ఇండియా ఏపెక్స్ బోర్డు సమావేశంలో జేబీసీసీఐ ఏర్పాటు అంశంపై కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా బీఎంఎస్ జాతీయ నాయకుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి కోల్ ఇండియా యాజమాన్యంతో జేబీసీసీఐ ఏర్పాటుకు సంబంధించిన అంశాలను చర్చించారు. కొత్త లేబర్ కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జేబీసీసీఐ ఏర్పాటుకు ఉన్న న్యాయపరమైన అంశాలపై సమావేశంలో చర్చించారు. ఇండస్ట్రియల్ రిలేషన్స్ (ఐఆర్) కోడ్‌లోని సెక్షన్ 14 నుంచి మినహాయింపు కల్పిస్తే జేబీసీసీఐ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని లక్ష్మారెడ్డి వివరించారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు లేఖ రాయాలని సమావేశంలో నిర్ణయించినట్లు ఏబికేఎంఎస్-బీఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్ తెలిపారు. కేంద్రం మినహాయింపు మంజూరు చేస్తే బొగ్గు పరిశ్రమలో కార్మికుల వేతన సవరణలు, సంక్షేమం, ఉద్యోగ సంబంధిత సమస్యలపై ద్వైపాక్షిక చర్చలకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్మికుల ప్రయోజనాల కోసం జేబీసీసీఐ ఏర్పాటుకు బీఎంఎస్ నిరంతరం కృషి చేస్తోందని మాధవ నాయక్ తెలిపారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు సదస్సు



**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 03:**

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు గురువారం మణుగూరు మండలం పగిడేరు గ్రామ పంచాయతీలో పార్టీ నాయకులు రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అందించిన రైతు రుణమాఫీ, రైతుబంధు పథకాలు ప్రస్తుతం అమలు కావడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎరువుల ఆన్‌లైన్ బుకింగ్ లతో ఇబ్బందులు పెడుతూ, ఇచ్చిన హామీలైన క్వింటాలుకు రూ.500 బోనస్, రూ.15,000 రైతుభరోసాని నిలిపివేసి రైతులను వంచిస్తోందని విమర్శించారు. 6 గ్యారంటీలు, 420 హామీల వైఫల్యంపై రైతులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్, మాజీ జెడ్పీటీసీ పోశం నరసింహారావు, నాయకులు నూకారపు రమేష్, ముత్యం బాబు, వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, యాదగిరి గౌడ్, ఆడప అప్పారావు, ముద్దంగుల కృష్ణ, ఎస్కే మోలానా, అక్కి నరసింహారావు, వేర్పుల సురేష్, పప్పుల ప్రసాద్, ఉపసర్పంచ్ గువ్వ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డి ఆశయాల బాటలో పయనిద్దాం.

**. కొణిజర్ల సెప్టెంబర్ 03 ప్రభాత వార్త:**

సారంపల్లి మల్లారెడ్డి ఆశయాల బాటలో మయనిద్దామని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్ర తాళ్లపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం పార్టీ చిన్నమునగాల గ్రామ శాఖ ఆధ్వర్యం లో మల్లారెడ్డి సంస్కరణ సభలో మల్లారెడ్డి చిత్రపటానికి చెరుకుమల్లి పురుషోత్తం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వ్యవసాయం, సాగునీరు ప్రభుత్వ బడ్జెట్లపై లోతైన అవగాహనతో ప్రజలను నిరంతరం చైతన్యం చేశారు. కల్తీ విత్తనాలు, ఎరువులు వ్యవసాయ రంగంలో బహుళ జాతి సంస్థల యొక్క దోపిడీపై ఎన్నో రచనలు చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పంటలు సాగునీటి ప్రాజెక్టులు రైతాంగ సమస్యలపై నిరంతరం అధ్యయనం చేసిన ఆయన పాత్రికేయులకు, రైతు ఉద్యమకారులకు, మేధా వుల పరిశోధనలకు విలువైన సమాచారాన్ని అందించారు. ఆలోచనలో ఆధునిక మేధావి మల్లారెడ్డి తను జీవించినంత కాలం ఎంతో నిడారంబ రంగా వుంటూ మూడు తరాల కమ్యూనిస్టు కార్యకర్తలకు సారంపల్లి ఒక సంధానకర్త. గ్రామస్థాయి కార్యకర్తగా మొదలై రాష్ట్రస్థాయి నాయకుడిగా రైతాంగ ఉద్యమనేతగా ఎదిగినా పదవుల కోసం, సౌకర్యాల కోసం ఏనాడు ఆరాటపడలేదు. వయస్సు కారణంగా నాయకత్వం బాధ్యతలనుంచి తప్పుకున్న ప్రజా ఉద్యమాలకు ఏనాడు దూరం కాలేదు. ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తూ 24 ఏళ్ళు సాధారణ అద్దె ఇంట్లో నివసిస్తూ ఎంతో నిరారం బరంగా ఉండేటటువంటి వ్యక్తి అని కొనియాడారు. 25 ఎకరాల ఆసామిగా ఉన్న సారంపల్లి మల్లారెడ్డి కమ్యూనిస్టుగా రైతాంగ ఉద్యమకారుడుగా ప్రజల కోసం పనిచేస్తూ తన ఉన్న ఆస్తినంత కూడా ఖర్చు పెట్టారే తప్ప తనకోసం ఏనాడు పోగు చేసుకోలేదు. ఉద్యమాన్ని తన జీవితానికే పరిమితం చేయకుండా కుటుంబాన్ని అందులో భాగస్వామ్యం చేశారు. చివరికి మరణాంతరం కూడా తన కళ్ళను, భౌతికకాయాన్ని వైద్య విద్య పరిశోధన కొరకు గాంధీ హాస్పిటల్ కు అందించి తన జీవితాన్నే సమాజానికి అంకితం చేసినటువంటి మహోన్నతమైన ˇటువంటి వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏర్పుల రాములు, బోయినపల్లి శ్రీనివాసరావు, మురికిపూడి నాగేశ్వరరావు, చెరుకుమల్లి మోహన్ రావు, ఇలారపు శేషయ్య, ఏర్పుల మణి, పాపగంటి అశోక్, ఇలారపు మురళి, గుడిమల్ల జార్జి, కంప సాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్లేట్లు గ్లాసులు పంపిణీ

**కామేపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త:**

పిల్లల చదువులపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ జి.వెంకటే,ఆర్కేపురం సర్పంచ్ అజ్మీర ద్వాలి, ఉప సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ కోరారు. ం శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం యూనిఫాం పంపిణీ చేశారు.గ్రామానికి చెందిన సాఫ్ట్వేర్ ఆంగోత్ నరేందర్ వితరణగా అందించిన ప్లేట్లు,గ్లాసులను పంపిణీ చేశారు. పిల్లలను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు.ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యా బోధన సాగుతున్నందున వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో హెచ్ఎం ధరావత్ మల్సూర్, వార్డు సభ్యులు భాగం రంగారావు, శ్రీను, చింతామణి, అజ్మీర చిన్ననాయక్, అంగన్వాడీ



టీచర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి మోటారు ఏర్పాటు.



**పినపాక, ప్రభాత వార్త, సెప్టెంబర్ 03**

.మల్లారం గ్రామపంచాయతీ పరిధిలోని కిందగుంపులో మంచినీటి మోటారు తరచూ కాలిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారం రోజుల వ్యవధిలోనే రెండుసార్లు మోటారు కాలిపోవడంతో స్థానిక ప్రజలకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గ్రామపంచాయతీ సర్పంచ్ ఇర్ప సాంబశివరావు చొరవ తీసుకున్నారు.గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కొత్త మంచినీటి మోటారును తెప్పించి ఏర్పాటు చేయించారు.మోటారు ఏర్పాటు అనంతరం నీటి సరఫరాను పునరుద్ధరించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ స్పందించి కొత్త మోటారు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మల్లారం గ్రామపంచాయతీ కార్యదర్శి తరుణ్ , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల ఏర్పాట్లపై సమావేశం

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 03:**



మణుగూరు మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీల నిర్వహణపై స్థానిక ఎంఆర్సీ భవనంలో ఎంఈఓ జి. స్వర్ణ జ్యోతి ఆధ్వర్యంలో గురువారం ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 9, 10 తేదీలలో మణుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అండర్14, అండర్17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వాలీబాల్ పోటీలు ఉంటాయని, విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఆదినారాయణ, అనిల్ కుమార్, సురేష్, కావ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమం మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం.

**పినపాక, ప్రభాత వార్త, సెప్టెంబర్ 03**





.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి రైతులను నట్టేట ముంచిందని బిఆర్ఎస్ మండల నాయకులు ఆరోపించారు. బిఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఇ బయ్యారం ఎక్స్ రోడ్డులో గల బిఆర్ఎస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి అధ్యక్షత ˇన రైతు సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం రైతుబంధును, రైతుభరోసాగా మార్చి నిర్వీర్యం చేశారని, రైతుభరోసా, రుణమాఫీ,వరి బోనస్ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్ ఫ్లాప్ అని, రానున్న ఎన్నికల్లో రైతులు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ౧ పాల్గొన్నారు.

## కన్నయ్యలుగా చిన్నారులు



**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్0 3:**

మణుగూరు పట్టణం లోని శ్రీ సత్య భాస్కర మాంటిస్సోరి స్కూల్‌లో





ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధల వేషధారణల్లో ముస్తాబై పాఠశాల ప్రాంగణంలో సందడి చేశారు. కన్నయ్యలుగా చిన్నారుల ముస్తాబై అందరిని ఆకట్టుకున్నారు. బాలకృష్ణుల రూపాల్లో చిన్నారులు చిందించిన ముద్దుముద్దు హావభావాలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ థామస్ మాట్లాడుతూ... విద్యార్థులకు చిన్నతనం నుంచే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలపై అవగాహన కల్పించేందుకే ఈ వేడుకలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలోపాల్గొన్నారు.

## వరికి బదులు కంది

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 03:**



ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉండటంతో, మణుగూరు మండలం గుట్టమల్లారం రైతులు వరికి ప్రత్యామ్నాయంగా నీటి అవసరం తక్కువగా ఉండే కంది పంటను సాగు చేస్తూ పంటల వైవిధ్యీకరణకు ముందడుగు వేశారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో ఈ మార్పు చేపట్టి ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు గురువారం గుట్టమల్లారంలో కంది చేలను పరిశీలించి, సాగు విధానాలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు పలు సూచనలు చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు తాతారావు, రాహుల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల ఏర్పాట్లపై సమావేశం

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 03:**

మణుగూరు మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీల నిర్వహణపై స్థానిక ఎంఆర్సీ భవనంలో ఎంఈఓ జి. స్వర్ణ జ్యోతి ఆధ్వర్యంలో గురువారం ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 9, 10 తేదీలలో మణుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అండర్14, అండర్17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వాలీబాల్ పోటీలు ఉంటాయని, విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఆదినారాయణ, అనిల్ కుమార్, సురేష్, కావ్య, వెంకట్ పాల్గొన్నారు.

## శిరీష హత్య కేసును సీబీఐకి అప్పగించాలి: తనీష్

### రెండు రోజుల్లో చర్యలు లేకుంటే జనసేన ఆధ్వర్యంలో ధర్నా

**ములకలపల్లి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**



హైదరాబాద్ తుక్కుగూడలో హత్యకు గురైన ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి, నర్సు ఊకే శిరీష కుటుంబాన్ని జనసేన తెలంగాణ రాష్ట్ర నాయకుడు, సినీ నటుడు తనీష్ గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఘటన వివరాలను తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. శిరీషపై జరిగిన అత్యాచారం, హత్య ఘటన తీవ్రంగా కలచివేసిందన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసినప్పటికీ కేసు దర్యాప్తుపై కుటుంబ సభ్యులకు అనుమానాలు ఉన్నందున, సమగ్ర విచారణ కోసం కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.శిరీష పనిచేస్తున్న ప్రైవేట్ ఆస్పత్రి వసతి గృహంలో కనీస భద్రతా సౌకర్యాలు, సీసీ కెమెరాలు, సెక్యూరిటీ రిజిస్టర్లు లేకపోవడం యాజమాన్య నిరక్ష ్యమ్లని ఆరోపించారు. బాధ్యులపై కేసు నమోదు చేసి, ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో నర్సుల భద్రతా ప్రమాణాలపై తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రెండు రోజుల్లో ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే జనసేన ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట ధర్నా చేపడతామని తనీష్ హెచ్చరించారు. శిరీషకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి సేన రాష్ట్ర సహాయ కార్యదర్శి ఊకే రవి, జనసేన నాయకులు గరికే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కన్నీళ్లకు కాంగ్రెస్‌దే బాధ్యత

### ములకలపల్లి రైతు సదస్సులో బీఆర్ఎస్ ధ్వజం

**ములకలపల్లి సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, కౌలు రైతులను దారుణంగా వంచిస్తోందని బీఆర్ఎస్ అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఖికాంగ్రెస్ మోసాలపై పోరుబాటఖి కార్యక్రమంలో భాగంగా గురువారం ములకలపల్లి మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో భారీ రైతు సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముందు స్థానిక సాయిబాబా గుడి నుండి పాత పోలీస్ స్టేషన్ వరకు నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులతో కలిసి భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం నిర్వహించిన సభలో పలువురు నేతలు ప్రసంగించారు. హామీల వైఫల్యంపై నిలదీరైతుబంధు నిధుల విడుదలలో జాప్యం, పూర్తిస్థాయి రుణమాఫీ కాకపోవడం వల్ల రాష్ట్రంలో రైతాంగం తీవ్ర నష్టపోతోందని మెచ్చా నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలు, యూరియా కోసం రైతులు మళ్లీ క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు, హామీలు అమలు చేస్తామని చెప్పి కాంగ్రెస్ దొంగ వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఆ గ్యారెంటీ కార్డులను ఎక్కడ పెట్టుకోవాలో పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే స్పందించకపోతే రైతుల తరఫున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటరమణ, మాజీ ఎంపీపీలు మాట్లా నాగమణి, జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మాజీ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, దొడ్డ రమేష్, జూపల్లి రమణారావు, బోయినపల్లి సుధాకర్, నల్లమోత్ వెంకటనారాయణ, రావు జోగేశ్వరరావు, సర్పంచ్‌లు భూక్యా ధర్మ, తుర్రం శ్రీను, తానం పద్మ, రసపుత్ర తిరుపతమ్మ మండల నాయకులు రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**పాల్వంచ,సెప్టెంబర్ 3, ప్రభాత వార్త:**




పాండురంగాపురంలోని మాస్టర్ మైండ్స్ కిడ్స్ స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.నర్సరీ నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులు శ్రీకృష్ణుడు,రాధాదేవి వేషధారణలో పాల్గొని ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా చిన్నారులు వెన్నముంతల కార్యక్రమం, భగవద్గీత శ్లోకాల పఠనం,సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించి ప్రేక్షకులను అలరించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాజు మాట్లాడుతూ,విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి,సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ సి.హెచ్. వంశీ ,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## పెద్దమ్మతల్లికి ఘనంగా సువర్ణ పుష్పార్చన

**పాల్వంచ,సెప్టెంబర్ 3,ప్రభాత వార్త:**



పాల్వంచలోని శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి)లో గురువారం అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వాహ ణాధికారి ఎస్.రజనీకుమారి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు ప్రత్యేక పూజలు,హారతి,మంత్రపుష్పం,నివేదన నిర్వహించారు.అనంతరం భక్తులు పెద్దమ్మతల్లిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు,అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## ఊకె శిరీష కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

### దుండగులను పాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలి

**కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**

హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రి నందు నర్సుగా పనిచేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండల ప్రాంత నివాసి అయిన ఊకె శిరీష కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు మంద నరసింహారావు, గిరిజన సంఘం నేత వంకుడోత్ అమర్సింగ్ డిమాండ్ చేశారు. జీవనాధారం కోసం, గౌరవప్రదమైన జీవితం కోసం నర్సుగా పని చేస్తూ సంతోషకరమైన జీవితం గడుపుతున్న ఊకే శిరీషను కామాంధులైన దుర్మార్గులు అత్యాచారం జరిపి అతి కిరాతకంగా హత్య చేసిన వారిని కఠినమైన శిక్షలు విధించాలని కోరుతూ నేడు గురువారం సీఐటీయూ ఆటో యూనియన్ కమిటి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఊకె శిరీష చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగ నివాళులు అర్పించటం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్, ఆటో యూనియన్ నాయకులు వీరస్వామి, గణేష్, శ్రీనివాస్ రావు, తారాచంద్ తదితరులు పాల్గొన్నారు.




## తహసీల్దార్ ను కలిసిన రజక కాలనీ ప్రజలు

**చుంచుపల్లి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**



మండలంలోని రామాంజనేయ కాలనీ పంచాయతీ పరిధిలోని 137/1 సర్వే నంబర్ లోని రజక కాలనీలో నివసిస్తున్న తమ ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించాలని కోరుతూ కాలనీ ప్రజలు గురువారం తహసీల్దార్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో చాలా కాలంగా నివసిస్తున్నప్పటికీ ఇళ్లకు ఇంటి నంబర్లు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు, ఇతర అధికారిక సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇంటి నంబర్లు కేటాయించి సమస్యను పరిష్కరించాలని కోరారు. సమస్యను పరిశీలించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు కాలనీ ప్రజలు తెలిపారు.

## ప్రకృతి పరిరక్షణపై లేఖా రచన పోటీ

### తపాలా శాఖ ఆహ్వానం

**కొత్తగూడెం టౌన్ , ప్రభాతవార్త, సెప్టెంబరు 3:**

భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో ఖిభూమాతకు లేఖ ప్రకృతిని కాపాడతాననే నా వాగ్దానంఖి అనే అంశంపై 202627 సంవత్సరానికి జాతీయ స్థాయి లేఖా రచన పోటీని నిర్వహిస్తోంది.ఈ పోటీలో అన్ని వర్గాల వారు పాల్గొనవచ్చు. గత నెల మొదటి తేదీ నుంచి వచ్చే నెల 31వ తేదీ వరకు పోటీ కొనసాగుతుంది. అక్టోబరు 31వ తేదీ తరువాత పంపిన లేఖలను స్వీకరించరు.వయస్సు ఆధారంగా నాలుగు విభాగాలు: 18 ఏండ్ల లోపు వారికి అంతర్దేశీయ లేఖా పత్రం విభాగం 18 ఏండ్ల లోపు వారికి జాబు విభాగం 18 ఏండ్లు పైబడిన వారికి అంతర్దేశీయ లేఖా పత్రం విభాగం 18 ఏండ్లు పైబడిన వారికి జాబు విభాగంరచన నియమాలు: జాబు విభాగంలో నాలుగు పేజీల కొలత గల తెల్ల కాగితంపై వెయ్యి పదాలకు మించకుండా లేఖ రాయాలి. దానిని ముద్ర కలిగిన జాబులో లేదా ఐదు రూపాయల తపాలా బిళ్ల అంటించిన సాధారణ జాబులో పంపాలి. అంతర్దేశీయ లేఖా పత్రం విభాగంలో నేరుగా అంతర్దేశీయ లేఖా పత్రంపై ఐదు వందల పదాలకు మించకుండా రాయాలి. లేఖలను తెలుగు సహా ఆంగ్లం, హిందీ లేదా ఏదైనా ప్రాంతీయ భాషలో రాయవచ్చు.లేఖలోనే "జనవరి ఒకటో తేదీ, 2026 నాటికి నా వయస్సు 18 ఏండ్ల లోపు / పైబడి ఉందని ధ్రువీకరిస్తున్నాను" అనే స్వీయ ధ్రువీకరణ తప్పనిసరి.లేఖలను ముఖ్య తపాలా అధికారి, తెలంగాణ మండలం, హైదరాబాదు 500001 చిరునామాకు పంపాలి.నగదు బహుమతులు: మండల స్థాయిలో మొదటి బహుమతి 25 వేల రూపాయలు, రెండవ బహుమతి 10 వేల రూపాయలు, మూడవ బహుమతి 5 వేల రూపాయలు జాతీయ స్థాయిలో మొదటి బహుమతి 50 వేల రూపాయలు, రెండవ బహుమతి 25 వేల రూపాయలు, మూడవ బహుమతి 10 వేల రూపాయలుపూర్తి వివరాలను భారత తపాలా శాఖ అధికారిక జాలగూడులో చూడవచ్చు.

## తపాలా బిళ్లల సేకరణ ఉపకార వేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

**కొత్తగూడెం టౌన్ , ప్రభాతవార్త, సెప్టెంబరు 3:**

భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖిదీన్ దయాళ్ స్పర్శ పథకంఖి తపాలా బిళ్లల సేకరణ ఉపకార వేతన పథకం 202627 సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.మంచి చదువుతో పాటు తపాలా బిళ్లల సేకరణను అభిరుచిగా కలిగిన ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ ఉపకార వేతనానికి అర్హులు. విభాగ, ప్రాంతీయ, మండల కార్యాలయాల ఆధ్వర్యంలో నిర్వహించే తపాలా బిళ్లల సేకరణ పోటీ పరీక్ష, తపాలా బిళ్లల సేకరణ పరిశోధన అంశం ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు.ఎంపికైన ప్రతి విద్యార్థికి ఏడాదికి ఆరు వేల రూపాయల చొప్పున (నెలకు ఐదు వందల రూపాయలు) ఉపకార వేతనం అందజేస్తారు.దరఖాస్తులకు చివరి తేదీ సెప్టెంబరు 21, 2026. ఖమ్మం విభాగం పరిధిలోని విద్యార్థులు తమ దరఖాస్తులను తపాలా కార్యాలయాల పర్యవేక్షకులు, ఖమ్మం విభాగం, ఖమ్మం 507003 చిరునామాకు పంపించాలి. పూర్తి వివరాలను భారత తపాలా శాఖ అధికారిక జాలగూడులో తెలుసుకోవచ్చు.

## సంబురాలు కాదు.. నియోజకవర్గంలో రోడ్లు బాగు చేయండి

**వాజేడు-భద్రాచలం రహదారి గుంతలమయం..**

**ఇసుక లారీలతో ప్రజల ప్రాణాలకు ముప్పు**

**ఆదివాసి హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇర్పా రాజు**

చర్ల, సెప్టెంబర్ 3 ( ప్రబాతవార్త )

భద్రాచలం నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకుండా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు కేవలం సంబురాలు, ఆర్భాట కార్యక్రమాలకే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇర్పా రాజు దొర అన్నారు. నియోజకవర్గంలోని వాజేడు నుంచి భద్రాచలం వరకు ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి, ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా భారీ ఇసుక లారీల నిరంతర రాకపోకలతో రహదారి మరింత దెబ్బతింటోందని ఈ విషయం పార్టీ నాయకులకు పట్టదా అని విమర్శించారు. వందలాది గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే రోగులు ప్రతిరోజూ ఈ రహదారిపైనే ఆధారపడుతున్నారని రహదారి గుంతల కారణంగా వాహన ప్రమాదాల ప్రమాదం పెరుగుతోందని, అంబులెన్సులు సైతం వేగంగా ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇసుక రవాణా ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నప్పటికీ, అదే ఇసుక లారీల కారణంగా దెబ్బతింటున్న రోడ్ల మరమ్మతులపై ఎందుకు నిరక్ష్యంగా వహిస్తున్నారని



ప్రశ్నించారు. భద్రాచలం నియోజకవర్గంలోని రహదారుల దుస్థితిపై అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. వాజేడు భద్రాచలం ప్రధాన రహదారిని తక్షణమే మరమ్మతులు చేసి, పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలి. గుంతలను వెంటనే పూడ్చి ప్రమాదాలను నివారించాలి భారీ ఇసుక లారీల రాకపోకలపై నిబంధనల ప్రకారం కఠిన నియంత్రణ విధించాలని లారీల ఓవర్‌లోడింగ్ అధిక వేగంపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేసారు. ఇప్పటికైనా నియోజకవర్గ ప్రజల సమస్యలను పట్టించుకోకుండా నిద్రపోతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు మేల్కొని తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రజలతో కలిసి రహదారి సమస్యపై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

## రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా మళ్ళా మోహన్ కుమార్ ఎంపిక

దుమ్ముగూడెం :ప్రభాతవార్త (సెప్టెంబర్ 3)



ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసింది రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన జాబితాలో దుమ్ముగూడెం మండలం సింగవరం గ్రామపంచాయతీలో నున్న పెదపాడు ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయుడు మళ్ళా మోహన్ కుమార్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు రాష్ట్రంలో 52 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికకాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు అందులో దుమ్ముగూడెం మండలానికి చెందిన మోహన్ కుమార్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడం గమనార్హం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఈ అవార్డులను అందించనుంది.

## జాతీయ అథ్లెటిక్స్ లో శ్రీ విద్య దొరకు కాంస్య పతకం

చర్ల, సెక్టెంబర్ 3, (ప్రబాతవార్త )



ఇండియన్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో పంజాబ్ రాష్ట్రం లుధియానాలో జరుగుతున్న జాతీయ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్షిప్లో చర్ల కు చెందిన శ్రీ విద్యా దొర 5.80 మీటర్ల లాంగ్ జంప్ లో కాంస్య పతకం సాదించడం జిల్లాకు ఎంతో గర్వకారణం అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహిదర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ విద్యా దొర కోచ్ జన్ను గిరి ప్రసాద్ లను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడల అధికారి ఎం. పరంధామ రెడ్డి రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి కే.సారంగపాణి జాతీయ కోచ్ ద్రోణాచారి అవార్డు గ్రహీత నాగపూర్ రమేష్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు గొట్టాపు రాధాకృష్ణ అభినందనలు తెలిపారు.

## కాంగ్రెస్ ఆద్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

చర్ల, సెప్టెంబర్ 3 ( ప్రభాతవార్త )



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో 1000 రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పిసిసి పిలుపు మేరకు ఈ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజలకు అందిస్తున్న సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంఎల్ ఏ వెంకట్రావు పాల్గొని పార్టీ శ్రేణులను ఉత్సాహ పరిచారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, బూత్ స్థాయి నాయకులు సర్పంచులు మాజీ ఎంపిటిసి లు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ 1000 రోజుల పాలన భేష్

**బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలి**

**మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి**

బూర్గంపహాడ్, ప్రభాతవార్త:



తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపెల్లి సుధాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ అసత్య ప్రచారాలకు పాల్పడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, మహిళలు, పేదలు, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, వృద్ధులు తదితర వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయడంతో పాటు రైతు భరోసా పథకం ద్వారా రూ.36 వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం అందించామని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి రూ.12,167 కోట్ల మేర ప్రయాణ చార్జీల భారం తగ్గించామని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 53 లక్షలకు పైగా కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలి విడతగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, గ్రేటర్ హైదరాబాద్‌లో లక్ష మందికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. 3.38 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేయడంతో పాటు 15.46 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని చెప్పారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. కొత్తగా మరో 2.25 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేశామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు. సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేపట్టామని, మరో 7,437 పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5 లక్షలకు పైగా పేద రోగులకు రూ.2,527 కోట్ల ఆర్థిక సహాయం అందించామని చెప్పారు. 22 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం అందించేందుకు రూ.720 కోట్లు కేటాయించామని తెలిపారు. రెసిడెన్షియల్ గురుకుల విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఇన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుంటే ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. అసెంబ్లీకి హాజరు కాకుండా జీతం తీసుకుంటూ, ప్రతిపక్ష నేతగా ప్రజా సమస్యలపై గళం విప్పాల్సిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఇరవెండి గ్రామ పంచాయతీకి విపంచి ఫౌండేషన్ పుస్తకాలు

**గ్రామీణ గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చెందాలి**

బూర్గంపహాడ్, ప్రభాతవార్త:



గ్రామీణ ప్రాంతాల్లో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించి, ప్రజల్లో విజ్ఞానాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇరవెండి గ్రామ పంచాయతీకి గురువారం పుస్తకాలను పంపిణీ చేశారు. హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో నిర్వహించిన గ్రామీణ గ్రంథాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా. మహ్మద్ రియాజ్, ఐఏఎస్ డా. ఏనుగు నరసింహారెడ్డి, విపంచి ఫౌండేషన్ చైర్మన్ ఏనుముల శ్రీనివాస్ హాజరయ్యారు. వారి చేతుల మీదుగా ఇరవెండి గ్రామ సర్పంచ్ గుండి బాబురావు, ఉప సర్పంచ్ మహంకాళి రామారావులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు చదివే ప్రదేశాలుగా కాకుండా విజ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని అన్నారు. యువత పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఇరవెండి గ్రామ పంచాయతీకి పుస్తకాలను అందించిన విపంచి ఫౌండేషన్ నిర్వాహకులకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భూక్యా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం మండల ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు

**-పెద్దినేని వెంకటేశ్వరరావు**

బయ్యారం,ప్రభాతవార్త,సెప్టెంబర్3:

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా బయ్యారం మండల ప్రజలకు కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దినేని మాట్లాడుతూ ఆ శ్రీకృష్ణ భగవానుడు మన అందరి కుటుంబాలను ఆనందంతో, ఆరోగ్యంతో, ఐశ్వర్యంతో ఆశీర్వదించాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు. గీతాసారంతో జీవితసారం చెప్పిన శ్రీకృష్ణ పరమాత్ముడిని స్మరించుకోవడం అంటే మన కర్తవ్యాన్ని మనం గుర్తుచేసుకుని ముందుకు సాగడమేనని అన్నారు. ఏ విషయంలో అయినా మనకు స్ఫూర్తినిచ్చే శ్రీ కృష్ణ తత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రతి అంశంలో మనం విజయం సాధించవచ్చొన్నారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆ నీలమేఘశ్యాముని కృపా, కటాక్షం మనందరిపై సదా ఉండాలని కోరుకుంటున్నట్లు పెద్దినేని తెలిపారు.

# అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలి

**కమర్తపు మురళి గ్లోబల్ ప్రచారం మానుకోవాలి**

**మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్**

ప్రభాతవార్త గాంధీ చౌక్: సెప్టెంబర్ 3.

ఖమ్మం నగరం 36వ డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై కాంగ్రెస్ నాయకులు కమర్తపు మురళి అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఇప్పటికైనా త్రీ టౌన్ పై అతను చేస్తున్న గ్లోబల్ ప్రచారం గత కొద్దిరోజులుగా కమర్తపు మురళి పొట్టి శ్రీరామల రోడ్డు, డివిజన్ అభివృద్ధిపై చేసిన వ్యాఖ్యలకు మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ స్పందించారు. తమ డివిజన్ పరిధిలో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల పరిస్థితి అధ్వానంగా ఉందని ఆయన ఆరోపించారు. పొట్టి శ్రీరామల రోడ్డు విస్తరణ కోసం కమిషనర్‌ను కలిసి స్థానికులను ఒప్పించింది నేను శివాలయం దగ్గర నుండి హర్కార బావి దాదాపుగా 180 ఇల్లు అందరితో మాట్లాడి దాదాపుగా 78 డాక్యుమెంట్లు కమిషనర్ గారికి అందజేయడం జరిగింది తరువాత అధికారులు వచ్చి రోడ్డు విస్తరణకు కొలతలు వేశారని తెలిపారు ఆ తర్వాత వారి స్వార్థం కోసం అక్కడ ఉన్న అధికార పార్టీ నాయకుడు రెండుసార్లు వాళ్లతో మీటింగ్ పెట్టి వారిని పక్కదోవ పట్టించి వారి వెనక ఉండి ఇంటికి ఐదు వేల రూపాయలు తీసుకొని కాలువలు ధ్వంసం చేశారు . కార్పొరేషన్ కాలువల్ని ఎలా ఎలా ప్రైవేట్ వ్యక్తులు ధ్వంసం చేస్తారు అని ఆరోజు పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వడం కూడా జరిగింది . మా డివిజన్లోని అన్ని ప్రాంతాల్లో ప్రాంతంలోని కాలువలు మున్సిపాలిటీకి సంబంధించినవేనని, ప్రైవేటు వ్యక్తులు వాటిని ఆక్రమిస్తే చర్యలు తీసుకోవాలని కోరారు. స్మార్ట్ డ్రైనేజీ పేరుతో ఏడాది క్రితం శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటి వరకు పనులు ముందుకు సాగలేదన్నారు. 2025 ఆగస్టు 14న మంత్రి శంకుస్థాపన చేసిన కాలువ పనులు కూడా పూర్తికాలేదని, రైల్వే శాఖ నుంచి రూ. 2 కోట్ల నిధులు వచ్చినా ఫలితం కనిపించడం లేదని విమర్శించారు. బ్రహ్మంగారి గుడి సమీపంలోని రోడ్డు పరిస్థితి, ఆంధ్రా బ్యాంకు నుంచి వైన్ షాపు వరకు రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాల లేమిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాల కోసం పలుమార్లు కోరినా స్పందన లేదని, 60 స్తంభాల ఏర్పాటుకు కమిషనర్‌కు లేఖ ఇచ్చినా ఎస్టిమేట్ దశలోనే పనులు నిలిచిపోయాయని తెలిపారు. వరద సాయం అందలేదని ఆరోపిఎస్‌పార్క్, పీసీకే తోట ప్రాంతాల్లో మధ్యతరగతి కుటుంబాలు అధికంగా నివసిస్తున్నాయని, వరద సాయం కోసం




168 మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఒక్క చెక్కు కూడా రాలేదని రామ్మోహన్ ఆరోపించారు. గతంలో మంత్రి అజయ్‌కుమార్ హయాంలో గాంధీచౌక్ నుంచి ఎంఆర్వో కార్యాలయం మీదుగా నయాబజార్ వరకు యూడీఎఫ్ నిధులతో రోడ్డు అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. అలాగే మా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో. 23 లక్షల లీటర్ల సామర్థం ఖమ్మం లో బాహుబలి వాటర్ ట్యాంక్ నిర్మాణం జరిగిందన్నారు. పిల్లి చిన్నట్టు తోట, పీసీకే తోట ప్రాంతాల్లో రూ. 90 లక్షలతో రోడ్లు, కాలువల పనులకు అనుమతులు తీసుకొచ్చినట్లు తెలిపారు. వ్యక్తిగత విమర్శలు సరికాదుమురళి వ్యాఖ్యలపై స్పందిస్తూ ముందుగా డివిజన్ పరిస్థితి, గతంలో జరిగిన అభివృద్ధి గురించి తెలుసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రి పక్కన ఉండి రెండుసార్లు పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన వారు ఇప్పుడు అభివృద్ధిపై మాట్లాడటం సరికాదన్నారు. పార్టీ పరంగా ఎవరికి ఏ అభిప్రాయం ఉన్నా అభ్యంతరం లేదని, అయితే వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన విధంగా స్పందిస్తానని హెచ్చరించారు. గాంధీచౌక్ ఖమ్మం నగరానికి గుండెకాయ వంటిదని, అలాంటి ప్రధాన ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు ఉండటం బాధాకరమన్నారు. తమ ప్రాంత ప్రజలు చీకట్లో జీవిస్తున్నారని, కనీసం వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా అభివృద్ధి జరిగిందని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. మైనారిటీ సోదరులు తమ స్థలాలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని చెప్పినప్పుడు వారిని కుర్చోబెట్టి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వెనుక దాబాల బజార్ రోడ్డులోని వాసవి గార్డెన్ నుంచి ముందున్న ప్రాంతం వరకు సరైన రోడ్లు, తారు, వీధి దీపాలు లేవని తెలిపారు. ఇందిరమ్మ చీరల పంపిణీపై ఫిర్యాదుఇతర డివిజన్లలో ఇందిరమ్మ చీరల పంపిణీ జరుగుతున్నప్పటికీ తమ డివిజన్‌లో నిలిపివేయడంతో గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. జూబ్లీ క్లబ్‌లో చీరలను నిల్వ ఉంచిన విషయం ఫొటోలతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే యూనిట్ ప్రారంభించి పంపిణీ చేయాలని ఆదేశించినట్లు మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ తెలిపారు.

## గుండె , ఊపిరితిత్తుల వైఫల్యంలో ఈ సి ఎం ఓ కీలక ప్రాణాధార చికిత్స

**ఖమ్మంలో యశోద మెడికల్ సెంటర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం**

ఖమ్మం వైద్య విభాగం, సెప్టెంబర్3(ప్రభాత వార్త ):

తీవ్రమైన గుండె లేదా ఊపిరితిత్తుల వైఫల్యంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ఎక్స్ట్రా కార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్ (ఈ సి ఎం ఓ )ఒక కీలకమైన అధునాతన ప్రాణాధార చికిత్సగా ఉపయోగపడుతుందని యశోద హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. గురువారం ఖమ్మంలోని యశోద మెడికల్ సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ డి. మధు కిరణ్ , డాక్టర్ వినీత్ ఇలాపురం , డాక్టర్ బి. అభిషేక్ మాట్లాడుతూ... హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక వైద్య మౌలిక సదుపాయాలు , అనుభవజ్ఞులైన నిపుణుల బృందం మరియు అధునాతన చికిత్సా విధానాలతో ఈ సి ఎం ఓ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు . ఈ సి ఎం ఓ ఎలా పనిచేస్తుంది ? దీనిలో లో ప్రత్యేకమైన కాన్యులాల ద్వారా రోగి శరీరం



నుంచి రక్తాన్ని బయటకు తీసి , ఈ సి ఎం ఓ సర్క్యూట్‌లోని మెంబ్రేన్ ఆక్సిజనేటర్ ద్వారా రక్తంలోకి ఆక్సిజన్‌ను అందించి , కార్బన్ డయాక్సైడ్‌ను తొలగిస్తారు . అనంతరం ఆక్సిజన్‌తో సమృద్ధిగా ఉన్న రక్తాన్ని తిరిగి రోగి శరీరంలోకి పంపిస్తారు. ఈ విధంగా ఈ సి ఎం ఓ కొంతకాలం పాటు ఊపిరితిత్తుల పనితీరుకు, అవసరమైన సందర్భాల్లో గుండె పనితీరుకు కూడా మద్దతు అందించే కృత్రిమ జీవనాధార వ్యవస్థగా పనిచేస్తుంది . తీవ్రమైన గుండెపోటు కారణంగా ఏర్పడిన కార్డియోజెనిక్ షాక్ , తీవ్రమైన గుండె వైఫల్యం , తీవ్రమైన శ్వాసకోశ వైఫల్యం, ఊపిరితిత్తుల వైఫల్యం వంటి ప్రాణాపాయ పరిస్థితుల్లో, ఎంపిక చేసిన రోగులకు ఈ సి ఎం ఓ ప్రాణాలను నిలబెట్టే వంతెనగా (బ్రిడ్జి థెరపీ ) ఉపయోగపడుతుందని వైద్యులు వివరించారు . అలాగే గుండె లేదా ఊపిరితిత్తుల మార్పిడి (ట్రాన్స్‌ప్లాంటేషన్ ) కోసం ఎదురుచూస్తున్న లేదా మార్పిడికి సిద్ధమవుతున్న ఎంపిక చేసిన రోగులకు కూడా ఈ సి ఎం ఓ కీలకమైన మద్దతును అందించగలదని తెలిపారు . దీనిలో లో ప్రధానంగా వినో ఆరటీరియల్ ఈ సి ఎం ఓ, వినో వేనస్ ఈ సి ఎం ఓ ) అనే రెండు విధానాలు ఉంటాయి. గుండె పనితీరుకు కూడా మద్దతు అవసరమైన సందర్భాల్లో వి ఏ ఈ సి ఎం ఓ ను, ప్రధానంగా తీవ్రమైన ఊపిరితిత్తుల వైఫల్యంలో గుండె పనితీరు తగినంతగా ఉన్నప్పుడు వి వి ఈ సి ఎం ఓ ను ఉపయోగిస్తామని వైద్యులు తెలిపారు . హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్స్‌లో అత్యంత అనుభవజ్ఞులైన వైద్యులు , సర్జన్లు , క్రిటికల్ కేర్ నిపుణుల సమన్వయంతో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం , కఠినమైన భద్రతా ప్రమాణాలు , వ్యక్తిగతీకరించిన చికిత్సా ప్రణాళిక మరియు సమగ్ర శస్త్రచికిత్సకు ముందు , అనంతర సంరక్షణ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో ఏ. శ్రీధర్ రావు, కె. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 5న జరుగు సీతక్క సంతాప సభను జయప్రదం చేయండి

**మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య పిలుపు**

ఖమ్మం అర్బన్, సెప్టెంబర్ 3(ప్రభాత వార్త )



విప్లవోద్యమ నాయకురాలు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు, అమరుడు కామ్రేడ్ ధర్మన్న జీవిత సహచరి కామ్రేడ్ సీతక్క సంతాప సభ సెప్టెంబర్ 5వ తేదీన శనివారం ఉదయం 11 గంటలకు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలో రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి సి వై పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంతాప సభలో ముఖ్యవక్తలుగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జాతీయ నాయకులు కె చేల రంగారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య, రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి సి హెచ్ శిరోమణి, పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు, కామ్రేడ్ సీతక్క కూతురు కే కల్పన, సీతక్క కుమారుడు గంగసాని కృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని సీవై పుల్లయ్య తెలిపారు. కామ్రేడ్ సీతక్క విప్లవద్యమంలో 60 ఏండ్లు ఆదివాసుల కోసం పేద ప్రజల పై జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా సాయుధ దళాలలో రహస్యంగా పనిచేశారని, పార్టీ డివిజన్ జిల్లా నాయకురాలుగా అభివృద్ధి అయినారని, వృద్ధాప్యం వచ్చిన తర్వాత ఖమ్మంలో తన కుమారుడు వద్ద ఉన్నారని తన 86 సంవత్సరాల వయసులో అమరురాలు అయినారని ఆయన తెలిపారు. సీతక్క మొదట ధర్మన్న తో సహా గుండాల ప్రాంతంలో పనిచేశారని, 1976లో పార్టీ నిర్ణయం మేరకు పశ్చిమగోదావరి జిల్లా ఏజెన్సీకి వెళ్లారని, 1991లో నడవలేని స్థితిలో లీగల్గా ఉండాని, పని చేయాలనీ, పార్టీ నిర్ణయం మేరకు బహిరంగ కార్యకలాపాల్లో పనిచేశారని ఆయన తెలిపారు. కనుక, సెప్టెంబర్ 5వ తేదీన ఖమ్మంలో జరిగే సీతక్క సంతాప సభలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## రైతు వ్యతిరేక విధానాలపై బిఆర్ఎస్ తీవ్ర నిరసన

గార్ల, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త:

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలు, ఇల్లందు నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఇల్లెందు మాజీ శాసన సభ్యురాలు హరిప్రియ హరిసింగ్ నాయక్ సూచనలతో మహబూబాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ అంగోత్ బిందు ముఖ్య అతిథిగా పాల్గొని మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అనుసర స్తున్న రైతు వ్యతిరేక విధానాలపై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారంలోకి రావడానికి వందలాది హామీలు గుప్పించిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక అన్నదాతలను నిలువునా మోసం చేస్తోందని, సాగు రంగాన్ని సంక్షోభంలో నెట్టివేస్తుందని మండిపడ్డారు. మండల పరిధి చిన్న కిష్టాపురం లో మృతిచెందిన భూక్యా మోహన్ గిరిజన రైతుకి రైతు భీమాతో పాటు ప్రభుత్వ నిర్లక్ష్యంతో నష్టపోయిన బాధిత కుటుంబానికి వెంటనే ఐదు లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎకరానికి రూ. 15,000 ఇస్తామని చెప్పి మాట తప్పిన ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి రైతుకూ రూ. 5లక్షల రైతు భీమా పరిహారాన్ని తక్షణమే అందించాలన్నారు. మండలంలో తీవ్ర నష్టాన్ని సృష్టించి, భూములను ఎడారిగా మార్చే మున్నేరుపాలేరు లింక్ కెనాల్‌కు సంబంధించిన జీవో నెంబర్ 98ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సన్న రకం ధాన్యానికి రూ. 500 బోనస్‌ను ఎలాంటి కోర్రీలు లేకుండా ప్రతి రైతుకూ అందించాలన్నారు. ప్రస్తుత సాగు సమయంలో యూరియా, ఇతర ఎరువుల కొరత లేకుండా సరిపడా స్టాక్ అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, ప్రతి గింజనూ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మండల బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి రమేష్, పొనుగంటి మోహన్ రావు, అమర్ చంద్, రత్నావత్ శంకర్, వెంకట్ రెడ్డి, పొనుగంటి రాధాకృష్ణ, బుడిగ మురళి, ఖదీర్ బాబా, రాందాస్, బాలు, గద్దం అశోక్, శ్రీనాథ్, తాళ్లూరి అనిల్, రవీందర్, రామారావు, మహేష్, ఎంకన్న, ఖలీల్, కార్యకర్తలు, అన్ని గ్రామ శాఖ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.